
ఆంధ్రజ్యోతి
**** ఇఫ్తార్ : 6.31 | సహర్ : 5.02 (శనివారం)
ANDHRAJYOTHY
నల్లగొండ
శనివారం 15 మార్చి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 కనిష్ఠం 20.0

ఆనందోత్సాహాలతో.. హోలీ

- రంగులు చల్లుకుంటూ వేడుకలు జరుపుకున్న ప్రజలు
- ఉదయం నుంచి అన్ని ప్రాంతాల్లో హోలీ సందడి
- ర్యాలీలతో సందడి చేసిన యువకులు



నల్లగొండలోని చైతన్యపురి కాలనీలో హోలీ వేడుకల్లో మహిళలు

జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ గడిపారు. ఏ పల్లె, పట్టణం వీధి చూసినా ఉదయం నుంచి సందడి కనిపించింది. ముఖ్యంగా చిన్నారులు గల్లీల్లో సందడి చేశారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు పట్టణాల్లో యువకులు ర్యాలీగా బయలుదేరి ఊరంతా సందడి చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, కలెక్టర్ ఐఏఎస్ అధికారి భవేష్‌మిశ్రా, కుటుంబ సభ్యులు, ఎస్పీ బంగ్లాలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ రంగులను చల్లుకుని హోలీ వేడుకలను జరిపారు. ఆయా పరిసరాలు రంగులతో నిండిపోయాయి. మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు, స్వామి వారి కల్యాణాలను నిర్వహించారు.



హోలీ వేడుకల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్ దంపతులు



ఎన్జీ కళాశాల ఆవరణలో హోలీ సంబురాల్లో స్థానికులు

పల్లెల్లో మళ్లీ చిచ్చు



పెరుగుతున్న నాటుసారా తయారీ
కేసులు నమోదు చేస్తున్నా ఆగని వైనం

నల్లగొండ జిల్లాలో నాటుసారా తయారీ మళ్లీ జడలు విప్పుతోంది. ముఖ్యంగా మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలో నాటుసారా తయారీ విపరీతంగా సాగుతోంది. ఇటీవల మద్యం ధరలు పెరగడం, తక్కువ ధరకు వస్తుండటంతో మద్యం ప్రియులు నాటుసారా వైపు మళ్లుతున్నారు. దీంతో చిన్న వయస్సులో కుటుంబ పెద్దలను కోల్పోయి ఆ కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఇంటి బాధ్యత మహిళలపై పడుతోంది. ఒక్క త్రిపురారం మండలం పెద్దదేవులపల్లిలో 100 మంది సారాతాగి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

పచ్చని సంసారంలో సారా తెచ్చిన చిచ్చు

(ఆంధ్రజ్యోతి-త్రిపురారం) పచ్చని సంసారంలో నాటుసారా చిచ్చుపెట్టింది. సారాకు బానిసైన ఓ వ్యక్తి మానలేకపోయాడు. ఆరోగ్యం క్షీణించి మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబం వీధిన పడింది. ఈ విషాదం నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామంలో జరిగింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఓ యువతి తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. తాత పెంచి పెద్దచేశాడు. 2018లో 18ఏళ్లకే వివాహం చేశారు. భర్తకు 1.5 ఎకరాల భూమి ఉండటంతో వ్యవసాయం చేస్తూనే కూలి పనులకు వెళ్లేవాడు. పెళ్లికాక ముందు నుంచే అతడికి సారా తాగే అలవాటు ఉంది. పెళ్లయిన తర్వాత అదే పరిస్థితి. చివరకు ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స అవసరాలకు 10 గుంటలు విక్రయించి రూ.10లక్షల వరకు ఖర్చుచేశారు. తర్వాత కూడా సారా మానకపోవడంతో 2024లో మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. భార్య వయస్సు 24 సంవత్సరాలు, కుమార్తె వయసు ఆరేళ్లు. ప్రస్తుతం కుటుంబం గడవడం కష్టంగా మారింది.



- వివరాలు 7వ పేజీలో

సాగునీటి సరఫరాకు అంతరాయం కలిగించొద్దు

చివరి భూములకు వెళ్లేలా సహకరించాలి



డీ-25 వద్ద తూముగేటును ఎత్తుతున్న ఏఎమ్మార్పీ సిబ్బంది

గుర్రంపోడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ నీరు చివరి భూముల వరకు వెళ్లేందుకు రైతులు సహకరించాలని ఎస్ఐ మధు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని కోయగూరవానిబాయి సమీపంలో డీ-25 వద్ద కొంతమంది రైతులు తూమును కిందికి దించి నీటి సరఫరాకు అంతరాయం కలిగించారు. సమాచారం తెలుసుకున్న ఏఎమ్మార్పీ అధికారులు శుక్రవారం ఉదయం అంతరాయం ఏర్పడిన ప్రదేశానికి వెళ్లి గేటును పైకి ఎత్తి కిందకు నీరు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఏఎమ్మార్పీ కాల్వపై అనధికారికంగా తూములు దించడం, కాల్వలకు అడ్డుకట్ట వేయడం, చేపల చెరువులోకి నీళ్లను మళ్లించడం వంటి చర్యలను మానుకోవాలని ఎస్ఐ మధు, ఏఈ శ్రీనివాసరావు సూచించారు. సాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధు హెచ్చరించారు.

నిఘా నామమాత్రమే..

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాల్లో సేవలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నామమాత్రంగా మిగిలిపోయాయి. ఏర్పాటుచేసిన ఒకటి, రెండు నెలలు సరిగ్గానే పనిచేసినా ఆ తర్వాత నిర్వహణ వైఫల్యంతో పనిచేయడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దాదాపు 50శాతానికి పైగా పీహెచ్‌సీలతో సీసీ కెమెరాలు పనిచేయని వైనం 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో తేటతెల్లమవుతోంది.

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్- నల్లగొండ)



- పీహెచ్‌సీల్లో అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు
- నెట్‌వర్క్ లేక, మరమ్మతులు చేయక పనిచేయని వైనం
- పలుచోట్ల విద్యుత్ కనెక్షన్లు తొలగించి పక్కన పడేసిన దుస్థితి



మర్రిగూడలో పనిచేయకపోవడంతో మూలనపడేసిన సీసీ కెమెరాలు

ప్రధానంగా నెట్‌వర్క్ లేకపోవడం, రీచార్జి చేయకపోవడం, కెమెరాలకు విద్యుత్ కనెక్షన్లు తొలగించివేయడం వంటి కారణాలతో అవి నిరుపయోగంగా మారిపోయాయి. పలు చోట్ల కెమెరాలు ఉన్నప్పటికీ విద్యుత్ కనెక్షన్లు తొలగించివేసి వాటిని పనిచేయకుండా చేశారు. అదేవిధంగా మరమ్మతులు వస్తే ఏజెన్సీకి సమాచారమిచ్చి, ఆపై వాటిని మరమ్మతులు చేయించడంలో పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. సీసీ కెమెరాలుంటే వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాల్సి ఉండడంతో పాటు, వైద్యసేవలు, మందుల విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉంటుండడంతో కొన్నిచోట్ల వాటిని ఉద్దేశ్యపూర్వకంగా పనిచేయకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

- (మిగతా 8వ పేజీలో)

సూర్యాపేట జిల్లాలోనూ అదే పరిస్థితి..

సూర్యాపేట జిల్లాలోనూ పలు పీహెచ్‌సీలలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల నెట్‌సదుపాయం లేక, మరికొన్ని చోట్ల విద్యుత్ కనెక్షన్లు లేకుండా చేయడం ద్వారా నిఘా లేకుండా పోయింది. కెమెరాల్లేకపోవడంతో డాక్టర్లు సిబ్బంది ఇష్టానుసారంగా వారికి వీలైన సమయంలో వచ్చిపోతున్నారని, సమయపాలన కొరవడిందని పలు పీహెచ్‌సీలలో రోగులు వాపోతున్నారు. మునగాల మండల కేంద్రంలో జాతీయ రహదారి వెంట ఉన్న పీహెచ్‌సీలో రెండేళ్లుగా కెమెరాలు పనిచేయడం లేదని వైద్యాధికారి రవీందర్ తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని లింగగిరి పీహెచ్‌సీలోని సీసీకెమెరాలకు ఇంటర్‌నెట్ సదుపాయం లేదు. కాంట్రాక్ట్ ఏజెన్సీనే నెట్‌సదుపాయం కల్పించాల్సి ఉండగా, వారు పట్టించుకోవడం లేదు. తిరుమలగిరిలో మూడేళ్ల క్రితం రెండు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినా ఒక్కటి కూడా పనిచేయడం లేదు. అడిగేవారు లేకపోవడంతో అవి మూలకుపడ్డాయి. మోతే మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఉన్న సీసీకెమెరాలు పనిచేయడం లేదు. నెట్ సదుపాయం లేకపోవడంతో ఇవి పనిచేయడం లేదని చెబుతున్నారు.

వైద్యులు ఉన్న సమయంలో విద్యుత్ కనెక్షన్ ఉంచుతున్నారని, వారు లేని సమయంలో కనెక్షన్ తప్పించి పక్కనపడేస్తుండడంతో జిల్లా కేంద్రం నుంచి పర్యవేక్షణ కొరవడుతుందని దీన్ని నియంత్రించాలని స్థానికులు చెబుతున్నారు. ఆత్మకూరు ఎస్ పీహెచ్‌సీలో మూడు సీసీ కెమెరాలు నాలుగైదేళ్లుగా నెట్ సదుపాయం లేక నిరుపయోగంగా మారాయి.

తిప్పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీసీ కెమెరాల తీరుపై అవగాహన లేదు. ఆరోగ్య కేంద్రంలో మూడు కెమెరాలు ఉన్నాయి. కానీ అవి పని చేస్తున్నాయా లేదా అనేది మాత్రం స్థానికంగా ఉండే వైద్యులకు తెలియకుండా ఉంది. కెమెరాలకు సంబంధించిన పూర్తి సమాచారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మాత్రమే తెలుస్తుందని స్థానిక డాక్టర్ చెబుతున్నారు. ఇక్కడ ఏ సమయంలో ఏమి జరుగుతుందో అనే విషయాలపై మాత్రం ఇక్కడి సిబ్బందికి గానీ, వైద్యులకు గానీ ఎలాంటి సమాచారం లేదు. మండల వైద్యాధికారి గదిలో, ల్యాబ్‌తో పాటు మెడిసిన్ గదిలో ఒక్కో కెమెరా చొప్పున ఉన్నాయి. కెమెరాల గురించి స్థానిక డాక్టర్ ప్రదీప్‌బాబును సమాచారం కోరగా ఆ కెమెరాల నిర్వహణ పూర్తిగా జిల్లా కేంద్రం నుండే ఉంటుందని సమాధానం ఇచ్చారు.

సాంకేతిక కారణాలతో అక్కడక్కడ పనిచేయడం లేదు

జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం జరిగింది. వీటి ద్వారా పనితీరును నిరంతరం పర్యవేక్షణ చేస్తుంటాం. అయితే అక్కడక్కడ చిన్నచిన్న సాంకేతిక కారణాలతో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని మా దృష్టికి వచ్చింది. వీటిని సరి చేసేందుకు టెక్నీషియన్స్‌ను కూడా ఏర్పాటు చేశాం. ఎక్కడైతే పని చేయకుండా ఉన్నాయో వాటన్నింటినీ సరిచేసి వినియోగంలోకి తీసుకొస్తాం. విధి నిర్వహణలో అలసత్వాన్ని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదు

- పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో, నల్లగొండ



కేతేపల్లిలో పనిచేయని సీసీ కెమెరాల సామాగ్రి

ప్రభుత్వ వైఫల్యాలను నిత్యం నిలదీస్తాం

జగదీ్‌షరెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నేతలు

మిర్యాలగూడ, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ది కాదని నియంతృత్వ పాలన అని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మాజీ మంత్రి జగదీ్‌షరెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేసినందుకు నిరసనగా నిరసనగా శుక్రవారం మిర్యాలగూడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కరి గొంతు నొక్కితే పోరాటం ఆగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై సభలో, బయట నిలదీస్తూనే ఉంటామన్నారు. ప్రజలు, రైతులకు చేయని సంక్షేమ పథకాలను చేసినట్లు ప్రకటించటాన్ని ఎత్తిచూపుతూ ప్రశ్నించినందుకు ప్రభుత్వం అక్రమ చర్యలకు పాల్పడుతుందని నాయకులు ఆరోపించారు. ఈ చర్యలపై ప్రజలను సమాయత్తం చేసి ప్రజాపోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. దేవరకొండ, మునుగోడులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. నకిరేకల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేస్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మోసిన్ అలీ, చిట్టిబాబు నాయక్, యడవెల్లి శ్రీనివాసరెడ్డి, నాగార్జునాచారి, బాబయ్య, బాలాజీ నాయక్, చిర్ర మల్లయ్య, మగ్దుమ్‌పాషా, సాదినేని శ్రీనివాసరావు. షోయబ్, హతీరాం నాయక్, రాములు గౌడ్, దినేష్, వేముల రాజు, రమేష్‌నాయక్, బొడ్డుపల్లి కృష్ణ, మందుల సత్యం, పగిళ్ల సతీష్, అయితగోని విజయ్‌గౌడ్, మేకల శ్రీనివాస్‌రెడ్డి, పరమేష్, రాజశేఖర్,జలెందర్, సైదులుయాదవ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ యల్లపురెడ్డి సైదిరెడ్డి, ఊట్కూరు ఏడుకొండలు, రమేష్, చెరుకు వెంకటాద్రి, బొడ్డు వెంకన్న, మేకల దేవయ్య, అంజయ్య, సుందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

- ఎంపీ చామల, ఎమ్మెల్యే సామేల్



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి కి తాను, ఎమ్మెల్యే మందుల సామేలు నిరంతరం కృషిచేస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మాదారం నుంచి ఇటుకులపహాడ్ వరకు, వల్లాల నుంచి జోలంవారిగూడెం వరకు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సామేలుతో కలిసి శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిన తెలంగాణ రాష్ట్రాన్ని నేడు సీఎం రేవంత్ రెడ్డి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఇటుకులపహాడ్ రోడ్డు నిర్మించాలని తాను ధర్నా చేశానని, ఇప్పటికీ తనపై ఆ కేసు ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రహదారులను మరమ్మతు చేయించకపోవడంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను, ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ ఇటుకులపహాడ్ రహదారి శిథిలావస్థకు చేరి పదేళ్లయినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నాట్లు వేసి నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. తన హయాంలో రోడ్డు మంజూరు చేసినందుకు సంతోషంగా ఉందని, 3నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నూక కిరణ్‌కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, అన్నెబోయిన సుధాకర్, తాళ్లూరి మురళీ, భూపతి వెంకన్న, ఇంతియాజ్ అహ్మద్, అల్లి సైదులు, నోముల జనార్ధన్, జయరాజ్ కాంచాని నాగరాజు, యల్లముల రమేష్, నాయకులు వేముల గోపినాథ్, పంచాయతీ రాజ్ డిఈ కొండయ్య, ఏఈ భరత్‌చంద్ర, రోడ్డు కాంట్రాక్టర్ యానాల చైతన్యరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మకు నాగహారతి పూజలు



కనగల్, మార్చి 14:(ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారికి నిజఅభిషేకాలు, శ్రీలక్ష్మి సహస్రనామాలతో విశేష పూజలు జరిపి నాగహారతినిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

బోర్డుపై బొమ్మలతో బోధన

తెలుగు ఉపాధ్యాయుడి వినూత్న యత్నం



బోర్డుపై బొమ్మలతో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు దామోదరచారి

నాంపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠ్యాంశం సులభంగా అర్థమయ్యేందుకు బోర్డుపై బొమ్మలతో వినూత్నంగా బోధన చేస్తున్నాడు నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంముష్టిపల్లి జడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయులు దామోదరాచారి. బోధనలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అనేది కీలకం. ఈ క్రమంలో పుస్తకం, చాక్‌పీస్, చార్ట్స్ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. అందుకు కొంత వ్యయ ప్రయాస అవసరం. అప్పుడు మాత్రమే తరగతి గదిలో పిల్లల పాఠ్యాంశం అర్థం చేసుకుంటారు. ముఖ్యంగా మాతృభాష తెలుగు బోధించడం అంత సులభం కాదు. ఎందుకంటే పద్యాన్ని పద్యంగా గేయాన్ని గేయంగా బోధించడం అందరితో సాధ్యం కాదు. కొందరు గేయం కళాత్మకంగా బోధించడం వారి సొంతం. ఈ నేపథ్యం ఉన్నప్పుడే చాలకాలం వారి మనస్సులో నిలిచిపోతుంది. బట్టీ పట్టాల్సిన అవసరం కూడ ఉండదు. ఇలాంటి కోవకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు తనదైన శైలిలో విద్యార్థులను ఆకట్టుకునే విధంగా ఉపాధ్యాయ బోధనలో విద్యార్థులను మరింత ఆకర్షింపజేస్తూ పాఠ్యాంశాలు బోధించడం ఈ పాఠశాల విద్యార్థులను ఎంతగానో ఆకర్షింపజేస్తుంది. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌లో భాగం గా పాఠ్యాంశంలోని బొమ్మలే కాక అనుబంధ బొమ్మలు కూడ నిమిషాల వ్యవధిలో బోర్డుపై వేస్తుండగానే తరగతి అంతా కూడా పాఠ్యాంశం వైపే మళ్లించడం తెలుగు ఉపాధ్యాయుని ప్రత్యేకత. పద్యాన్ని గేయాన్ని తనదైన శైలిలో కళాత్మకంగా బోధిస్తుండటంతో విద్యార్థులు ఆనందానికి ఇంకేం కావాలి. దీంతో సదరు ఉపాధ్యాయుని పట్ల విద్యార్థులకు కాదు తల్లిదండ్రులకు గ్రామస్తులకు బోధన పట్ల పూర్తి విశ్వాసం కలిగింది.



ఆకుపచ్చ వసంతం

హేమంత రుతువులో మొదలయ్యే యాసంగి సాగు పనులు, వసంత రుతువుతో ముగుస్తాయి. నాట్లు, కలుపు తీతలు, పొట్ట దశలన్నీ దాటుకుని వసంత రుతువు ప్రారంభం నుంచి ఎండలు మండే గ్రీష్మం వరకూ కోతలకు వస్తాయి. నల్లగొండ జిల్లా కనగల్ మండలం చండూరు-కనగల్ రహదారిపై జి.యడవల్లి గ్రామ సమీపంలో ఆకుపచ్చని పంట పొలాలు.



గ్రీష్మానికి ఆహ్వానం

నల్లగొండ జిల్లా కనగల్ మండలం జి.యడవల్లి గ్రామంలో నల్లగొండ-చండూరు మార్గంలో ఆకులు రాలుతుండటంతో మోడువారుతున్న చెట్లు.

నిమ్మలో అంతర పంటగా టమాట

- పచ్చి మిర్చితో పాటు ఇతర ఆహార దినుసులు
- అదనపు ఆదాయం పొందుతున్న రైతు



నిమ్మతోటలో అంతర్ పంటగా సాగు చేస్తున్న టమాట

నిమ్మ తోటలో అంతర్ పంటగా టమాట, పచ్చి మిర్చిని సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు ఓ రైతు. దిగు బడి ఆశించిన మేరకే వచ్చినా మార్కెట్‌లో ధర లేకపోవడం లాభం రాలేదంటున్నాడు. వీటితో పాటు ఇంటి అవసరాల కోసం ఇతర ఆహార దినుసులను కూడా పండిస్తున్నాడు.


- (ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి)

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి గ్రామానికి చెందిన దేశగాని వెంకటేశ్వర్లుకు నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీం తో కొన్నేళ్లుగా ఆ భూమిలో వరిసాగు మాత్రమే చేశాడు. అయితే ఈ క్రమంలో కొద్దిరోజులకు వరికి బదులు కొంత భూమిలో తోటను వేయాలని సంకల్పించాడు. ఎకరన్నర భూమిలో ఉపాధి హామీ పథకం కింద 120 నిమ్మ మొక్కలు నాటాడు. రెండేళ్ల క్రితం నాటిన ఈ మొక్కలు ఇపుడిప్పుడే పెరుగుతున్నాయి.వాటి సంరక్షణకుగాను ఉపాధిహామీ పథకం కింద వాచ్‌అండ్‌వార్డు ప్రతీ నెలా మొక్కకు రూ.12ల చొప్పున ఆర్థికసాయం కూడా అందుతోంది. అయితే నిమ్మతోట ఒక్కటీ నాలుగేళ్ల తర్వాతకాపు వస్తుందని అంతర్ పంటగా మరేదైనా సాగుచేయాలని ఆలోచించాడు.

రోజుకు 70 కిలోల టమాట

అంతర్ పంటగా టమాట, పచ్చి మిర్చిలను 8 నెలలుగా సాగు చేస్తున్నాడు. రెండు మొక్కలను కలిపి సుమారు 8 వేల మొక్కలను మల్చింగ్ ఏర్పాటు చేశాడు. మొక్కలు పెరిగేందుకు అడుగు మందు, రసాయనాలు కలిపి సు మారు రూ.30,000లు పెట్టుబడి పెట్టాడు. కాగా మల్చింగ్‌లో నాటిన వాటిలో కొన్ని ఎండిపోగా పాదుకుని పెరిగిన మొక్కల నుంచి ప్రస్తుతం రోజుకు 70 కిలోల టమాట, 25 నుంచి 30 కిలోల పచ్చి మిర్చి దిగుబడిని సాధిస్తున్నాడు.

దిగుబడి ఉంది..ధరే లేదు



నిమ్మ తోటలో అంతర్ పంటగా టమాట, పచ్చి మిర్చి సాగు చేస్తున్నా. ఈ అంతర్ పంట వల్ల నిమ్మ తోటకు వచ్చే నష్టమేమీ లేదు. పచ్చిమిర్చి, టమాట దిగుబడి కూడా ఆశించిన స్థాయిలోనే వస్తుంది. కాకపోతే మార్కెట్‌లో గిట్టు బాటు ధర లేకపోవడమే కొంచెం బాధగా ఉంది. మిర్చి, టమాటకు మార్కెట్‌లో ధర ఉంటే ఇలా అంతర్ పంటలు వేసుకోవడం రైతులకు లాభదాయకమే.

- దేశగాని వెంకటేశ్వర్లు

డ్రగ్స్ నియంత్రణపై వినూత్న ప్రచారం



వేములపల్లి, మార్చి 14, (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని సూర్యాపేట జిల్లా గోరంట్ల ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ శుక్రవారం ఆమనగల్లు జాతరలో వినూత్న ప్రదర్శన నిర్వహించారు. జాతరలో విస్తృతంగా పర్యటిస్తూ మైక్ ద్వారా ప్రచారం చేస్తూ కరపత్రాలను పంచుతూ 'నో డ్రగ్స్ - సేవ్ లైఫ్' అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నాడు. ధూమపానం, మద్యం, డ్రగ్స్ వంటివి ప్రాణాంతకమని వాటిని నిర్మూలించాలని ప్రచారం నిర్వహించారు. ఒక వైపు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూనే సెలవు దినాల్లో జిల్లా నలుమూలలో జరిగే జాతరలో, సంతలో యువతకు సందేశం అందించాలనే తలంపుతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు.

గ్రూప్స్‌లో జిల్లా వాసుల ప్రతిభ



సాయికృష్ణారెడ్డి

మోత్కూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పట్టణానికి చెందిన గుర్రం మోహన్‌రెడ్డి-స్వరాజ్యం కుమారుడు సాయికృష్ణారెడ్డి రాసిన ప్రతీ పరీక్షలోనూ ర్యాంకు సాధిస్తున్నాడు. ఈనెల 11న ప్రకటించిన గ్రూపు-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయి 11వ ర్యాంకు సాధించగా శుక్రవారం ప్రకటించిన గ్రూపు-3 ఫలితాల్లో రాష్ట్రస్థాయి 29వ ర్యాంకు సాధించాడు. గత డిసెంబర్‌లో ప్రకటించిన గ్రూపు-4లో ఫలితాల్లో జిల్లా ప్రథమ ర్యాంకు సాధించి. గత డిసెంబరు 18 నుంచి కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం చేస్తున్నాడు. కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం చేస్తూ గ్రూపు-2లో రాష్ట్రస్థాయి 11వ ర్యాంకు సాధించిన సాయికృష్ణారెడ్డిని కలెక్టర్ హనుమంతరావు పలువురు అధికారులు గురువారం సాయంత్రం అభినందించారు. గ్రూప్-1 సాధించి డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమన్నారు.

గ్రూప్- 3 లో మెరిసిన కానిస్టేబుల్



శంకర్

సంస్థాన్ నారాయణపురం : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్ గ్రూప్-3లో 165వ ర్యాంకు సాధించాడు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోల్ గ్రామానికి చెందిన మంటిపల్లి బజార్-యాదమ్మ కుమారుడు శంకర్ 2020లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం నారాయణపురం పోలీస్ స్టేషన్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2024లో ఎక్సైజ్ పోలీస్ కానిస్టేబుల్‌గా గత నవంబర్‌లో విడుదలైన గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో 674వ ర్యాంకు సాధించాడు. తాజాగా శుక్రవారం విడుదలైన గ్రూప్-3లో 165 ర్యాంకు సాధించాడు. శంకరును పలువురు అభినందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ నారాయణపురలోని శాఖ గ్రంథాలయం తనకు ఎంతో ఉపయోగపడిందన్నారు.

గ్రూప్-2లో అనూష ప్రతిభ



బాల్ద అనూష

భువనగిరి రూరల్ : భువనగిరి మండలం పెంచికల్ పహాడ్ గ్రామానికి చెందిన బాల్ద అనూష గురువారం విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో ప్రతిభ కనబరిచి గెజిటెడ్ హోదా ఉద్యోగానికి ఎంపికైంది. ప్రస్తుతం ఆమె .యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. 2024లో తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్షలో ప్రతిభ కనబరిచి ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. గ్రూప్-3 పరీక్షలో ప్రతిభ కనబరిచి రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. గ్రూప్-2 ఫలితాల్లో ప్రతి భ కనబరిచి గెజిటెడ్ హోదా కలిగిన ఉద్యోగానికి ఎంపికైంది. ఈసందర్భంగా వరుసగా 4 ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అనూషను గ్రామస్థులు అభినందించారు.

చిలుకూరులో..



కోన సతీష్

చిలుకూరు: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల నారాయణపురం (పాలె అన్నా రం) గ్రామానికి చెందిన బూర సతీష్ నాలుగు ఉద్యోగాలు సా ధించి సత్తా చాటాడు. గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించి సూర్యాపేట కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే గ్రూ ప్- 2లో 206 ర్యాంక్, శుక్రవారం ప్రకటించిన గ్రూప్-3లో 318 ర్యాంకు సాధించాడు. వీటితో పాటు 2023 రైల్వేలో కూడా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అప్పటి నుంచి ఉద్యోగ ప్రయత్నం చేస్తూ నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు.

గ్రూప్ -3లో స్టేట్ 211వ ర్యాంక్



కోన సతీష్

ఆత్మకూర్(ఎస్): ఆ కుటుంబంలో ప్రాథమిక స్థాయి లోనూ చదవలేదు. సరైనా చేయూతనిచ్చే వా రు లేక పోయినా పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రభు త్వ ఉద్యోగమే లక్ష్యంగా చదువుకు ప్రాధాన్యం ఇస్తూ మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాడు. ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్ గ్రామానికి చెందిన కోన లింగయ్య-పద్మ దంపతుల ప్రథమ కుమారుడు కోన సతీష్ శుక్రవారం విడుదల చేసిన గ్రూప్-3 ఫలితాల్లో స్టేట్ 211ర్యాంక్ సాధించాడు. 8ఏళ్లుగా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ గ్రూప్స్‌లో ఉద్యో గం సాధించాలన్న ఆశయంతో మరో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గత సెప్టెంబరులో విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో ఎంపికయ్యాక గ్రూప్స్‌కు ప్రాధాన్యం ఇస్తూ పట్టుదలతో చదివి, గ్రూప్-3లో ర్యాంక్ సాధించాడు.

గరిడేపల్లిలో..

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన కీత లక్ష్మీనారాయణ 2018లో పోలీస్ నోటిఫికేషన్‌లో సివిల్‌కానిస్టేబుల్‌గా ఎంపికై విధులు నిర్వహిస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. గ్రూప్-2లో 597 ర్యాంక్ సాధించి, గ్రూప్-3లో 192వ ర్యాంక్ సాధించాడు. గ్రూపు-2, 3లో ర్యాంకు సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చందంపేటలో ఎలుగుబంటి సంచారం

● భయాందోళనలో గ్రామస్థులు



పొగిళ్ల గ్రామంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

చందంపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చందంపేట మండలం పొగిళ్ల గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఎలుగుబంటి సంచరించింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఎలుగుబంటి రెండు, మూడు రోజులుగా ప్రతిరోజు తెల్లవారుజామున 3 గంటల సమయంలో గ్రామంలో సంచరిస్తుందని గ్రామస్థులు తెలిపారు. దీంతో ఎలుగుబంటి మనుషులు, పశువులు, మేకలపై దాడి చేస్తుందేమోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై కంబాలపల్లి అటవీశాఖ అధికారి భాస్కర్‌ను వివరణ కోరగా రెండు రోజుల నుంచి ఎలుగుబంటి సంచరిస్తుందన్న విషయం తెలుసుకొని అటవి బీట్ ఆఫీసర్‌ను అప్రమత్తం చేశామని, గ్రామస్తులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

పాన్‌షాపు నిర్వాహకుడు రూ 3.50 కోట్లకు ఐపీ

● వరుస ఘటనలతో కోదాడ వాసులు బెంబేలు

● డిసెంబరు నుంచి 8 మంది దాదాపుగా

రూ.10కోట్లకు ఐపీ దాఖలు

కోదాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని పద్మావతి మీసేవ సమీపంలోని ఓ పాన్ షాపు నిర్వాహకుడు రూ 3.50కోట్లకు ఐపీ దాఖాల చేసినట్లు సమాచారం. ఐపీ దాఖలు చేసిన షాపు నిర్వాహకుడు బుధవారం నుంచి పరారీలో ఉన్నట్లు సమాచారం. సుమారు 76 మంది బాధితులు ఉన్నట్లు వినికిడి. గత నెల అదే షాపు సమీపంలోని అనంతగిరి రోడ్డులో ఓబుక్ దుకాణం నిర్వాహకుడు రూ. కోటి మేర ఐపీ దాఖలు చేశారు. అది మరవక ముందే పాన్‌షాపు నిర్వాహకుడు ఐపీ దాఖలు చేయడంతో పట్టణవాసు లు బెంబేలెత్తుతున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి సుమారు 8మందిరూ 10కోట్లకు ఐపీ దాఖలు చేయటంతో, కోదాడలో చేబదులు ఇవ్వాలన్నా ప్రతిఒక్కరూ భయపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోదాడ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాపుగల్లు ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన తల్లోజు దుర్గాచారి (27) కోదాడ పట్టణంలోని హిందూజ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పని నిమిత్తం బైక్ మీద కోదాడ నుంచి మేళ్లచెర్వు వైపు వెళ్తుండగా, కాపుగల్లు ఎక్స్‌రోడ్డు వద్ద కాపుగల్లు నుంచి కోదాడ వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో దుర్గాచారి తీవ్రంగా గాయపడడంతో అతన్ని వెంటనే 108 ద్వారా కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి సూర్యాపేట తరలిస్తుండగా, మార్గంమధ్యలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్య

చిట్యాలరూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనిపాకల గ్రామంలో శుక్రవారంఅనారోగ్య సమస్యలతో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది.ఎస్‌ఐ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన జటంగి మల్లమ్మ(75) కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో విసిగిపోయిన మల్లమ్మ ఇంట్లోని బాత్‌రూంకు వెళ్లి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వేడికి భరించలేక బయటకు రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108లో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడికి తరలించారు. అకడ చికిత్స పొందుతున్న మల్లమ్మ మధ్యాహ్నం తరువాత మృతిచెందినది. మృతురాలి కుమారుడు సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యాదగిరీశుడికి వైభవంగా సువర్ణ పుష్పార్చన



అద్దాల మండపంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న పూజరులు

యాదగిరిగుట్ట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రాకార మండ పంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయ రీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించి సేవలో తీర్చి దిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధి ష్ఠింప జేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నిరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని రామ లింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 29,93,218 ఆదాయం సమ కూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

హ్యాంగర్ ఫ్యాబ్రిక్ బిగింపు ప్రక్రియ పూర్తి

ఆలయ ఉత్తర తిరువీధిలో భక్తుల నీడ కోసం జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్ బిగింపు ప్రక్రియ పూర్తి చేశారు. మిగిలిన పైభాగం (రథశాల ముందు) యాగశాల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పందిరి అడ్డు రావడంతో అక్కడ పనులు నిలిచిపోయినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

కొండపైన హోలీ వేడుకలు

యాదగిరికొండపై శుక్రవారం హోలీ (వసంత కేళీ) వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వసంత రుతువులో తొలి వేడుక అయినందున వసంత కేళీ అని పిలుచుకుంటారు. పౌర్ణమి రోజున వసంతోత్సవంలో స్వామి అమ్మవార్లను మనోహరంగా అలం కరించి పల్లకిపై తిరువీధి సేవ చేపట్టారు. వేడుకల్లో అనువం శిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహ మూర్తి, అధికారులు, సిబ్బంది రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో స్థానిక భక్తులకు సమాచారం ఇవ్వ కుండానే ముందస్తుగా వేడుకలు ముగించారని స్థానిక భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



కొండపైన హోలీ సేవ నిర్వహిస్తున్న అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తదితరులు

గొర్రెను మింగేందుకు కొండచిలువ యత్నం



చింతలపాలెంలో గొర్రెను మింగేందుకు ప్రయత్నిస్తున్న కొండచిలువ

తిరుమలగిరి(సాగర్), మార్చి 14(ఆంధ్రజ్యోతి): మేతకు వెళ్లేందుకు అడవికి వెళ్లిన గొర్రెల మందపై కొండచిలువ దాడికి ప్రయత్నించింది. ఈ సంఘటన శుక్రవారం రోజు మండలంలోని చింతలపాలెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షి అయిన గొర్రెల కాపరి చింతల సైదులు తెలిపిన వివరాల ప్రకారం రోజులాగానే గొర్రెల మందతో మేత కోసం గ్రామ సమీపంలోని అడవి ప్రాంతానికి వెళ్లినట్లు పేర్కొన్నాడు. ఈ క్రమంలో చెట్ల పొదల్లో దాక్కున్న సుమారు 15 అడుగుల కొండ చిలువ మందపై దాడి చేసి ఒక గొర్రెను పట్టుకోని దాని చుట్టు గట్టిగా పెనవేసుకోని చంపడానికి ప్రయత్నించింది. దీన్ని గమనించిన సైదులు వెంటనే గట్టిగా కేకలు వేస్తూ కొండ చిలువపై రాళ్లతో కొట్టేందుకు ప్రయత్నించగా అది తప్పించుకోని సమీపంలోని బావిలోకి వెళ్లిపోయింది. అనంతరం అక్కడికి వెళ్లి చూడగా గొర్రె నడవలేని స్థితిలో ఉందని గుర్తించాడు. దీంతో గ్రామస్థుడైన వరదపాక రాజాలుకు చెప్పడంతో అతను ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు జరిగిన సంఘటన గురించి సమాచారం ఇచ్చాడు. దీంతో ఫారెస్ట్ సిబ్బంది పాములను పట్టడంలో నైపుణ్యం ఉన్న ఉంగరాల శ్రీనుతో కలిసి రాగా అప్పటికే కొండచిలువ బావిలోని బొరియలోకి వెళ్లిందని గుర్తించి తిరిగి వెళ్లిపోయారు. గత 15రోజుల క్రితం కూడా ఇదే ప్రాంతంలో ఒక గొర్రెను కొండచిలువ ఇలాగే పట్టుకోని మింగేసిందని ప్రత్యక్ష సాక్షి సైదులు పేర్కొన్నాడు. గత నాలుగు నెలల కాలంలో ఈ విధమైన సంఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు. వ్యవసాయం చేసుకోనే పొలాలకు సమీపంలో తరుచుగా కొండచిలువలు తారస పడుతుండడంతో ఆ ప్రాంత రైతులు భయాందోళన చెందుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మాడ్గులపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కల్వలపాలెం గ్రామంలో గల పాలేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండుట్రాక్టర్లను గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు.. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం కల్వలపాలెం గ్రామానికి చెందిన వల్లంపట్ల గోపి, చిట్యాల సురేష్ ఎలాంటి అనుమతి లేకుండా గురువారం రాత్రి సమయంలో తమ ట్రాక్టర్ల ద్వారా పాలేరువాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొ ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి గోపి, సురేష్‌తోపా టు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.


● ఆత్మకూర్(ఎస్) : మం డలంలోని ఏపూరు గ్రామానికి చెందిన సుదగాని సందీప్ శుక్రవారం తెల్లవారు జామున పాలేరు వాగు నుంచి ఇసుక తరలి స్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

చిచ్చు పెడుతోంది

- నాటుసారా తాగి కుటుంబాలు చిన్నాభిన్నం
- చిన్న వయసులోనే బానిసలవుతున్న యువత
- మొన్నటి వరకు ఉక్కుపాదం మోపినా మళ్లీ పడగ విప్పుతోన్న భూతం

తెలంగాణను గుడుంబా రహిత రాష్ట్రంగా చేయాలని ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంతో మొన్నటి వరకు గుడుంబా తయారీ అదుపులోకి వచ్చింది. సారా తయారు చేసి బైండోవర్ చేసినా మళ్లీ పట్టుబడితే పీడీయాక్ట్, రూ.లక్ష జరిమానా విధించడంతో గ్రామాల్లో కట్టడి అయిన సారా భూతం నల్లగొండ జిల్లాలో మళ్లీ పడగ విప్పుతోంది. నాటు సారా ప్రాణాంతకమని తెలిసినా తక్కువ ధరకు వస్తుండడంతో తాగి కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. యువత గుడుంబాకు బానిసలై యుక్త వయస్సులోనే అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి - తిరుమలగిరి(సాగర్), మిర్యాలగూడ రూరల్, త్రిపురారం, దేవరకొండ)



ఆంధ్రజ్యోతి పరిశీలన

కేసులు నమోదవుతున్నా భయం లేదు



జమ్మనకోటలో పట్టుబడిన బెల్లం బస్తాలు(ఫైల్)

దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, పీఏపల్లి, పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), అడవిదేవులపల్లి, త్రిపురారం, దామరచర్ల మండలాల్లోని పలు తండాల్లో గుడుంబా తయారు చేస్తుండడంతో ఏడాదిగా పెద్ద సంఖ్యలో కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మద్యంతో పోలిస్తే సారా తక్కువ ధర ఉండడం, తండావాసులకు గుడుంబా తయారీపై అవగాహన ఉండడంతో వారే సొంతంగా తయారు చేసి చుట్టుపక్కల గ్రామాలకూ సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

హాలియా సర్కిల్ పరిధిలో సుమారు 150 కేసులు

గుడుంబా, పానకం తయారీ, బెల్లం నిల్వ, గుడుంబాతో పట్టుబడిన నిందితులు, బెల్ట్‌షాపులు కలుపుకొని హాలియా సర్కిల్ పరిధిలో 2024 జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 150 కేసులు నమోదైనట్లు స్థానిక ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలో ప్రధానంగా త్రిపురారం మండలంలోని లోక్యాతండా, పెద్దదేవులపల్లి, బడాయిగడ్డ, తిరుమలగిరి(సాగర్) మండలంలోని జువ్విచెట్టుతండా, మేగ్యాతండా, జమ్మనకోట, పెద్దవూర మండలంలోని పర్వేదుల, అనుముల మండలంలోని నాయుడుపాలెం తదితర తండాల్లో గుడుంబా తయారీ, విక్రయ కేసులు నమోదయ్యాయి. తండాల్లో బెల్లం నిల్వ చేయకుండా జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాలు విజిలెన్స్, ఎక్సైజ్ పోలీసులు ఎప్పటికప్పుడు దాడులు చేస్తుండడంతో తయారీదారులు తెల్ల బెల్లాన్ని పలు కిరాణ షాపుల నుంచి సేకరించి గుడుంబా తయారీకి వినియోగిస్తున్నట్లు తెలిసింది.

యుక్త వయసులోనే ఆ గ్రామంలో మరణ ఘోష



నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామంలో సారా ఏరులై పారుతోంది. గ్రామ జనాభా 6వేలు కాగా సుమారు 20పైనే సారా విక్రయ కేంద్రాలున్నాయి. వీధికి ఒకటి చొప్పున ఉన్నాయంటే అతి యోశక్తి కాదు. రోజుకు 200లీటర్ల సారా విక్రయిస్తారు. గ్రామంలో రోజు వారి కూలీలే ఎక్కువ. ఆదాయం సారా తాగుడుకు వెచ్చిస్తుండడంతో కుటుంబాలు చితికిపోతున్నాయి. 20-40ఏళ్ల వయస్సు మధ్య ఉన్న వాళ్లే దాదాపుగా వంద మంది వరకు సారా కాటుకు బలైపోయారని గ్రామస్థులు చెబుతున్నారు.

అంతా విషాదమే..

చిన్న వయసులో భర్తలు చనిపోవడంతో కుటుంబ భారం అంతా మహిళలపై పడడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. పిల్లల ఆలనా పాలనా కష్టంగా మారింది. కూలి పనులకు వెళ్తూ బతుకు సాగిస్తున్నారు. ఇటు వంటి కుటుంబాలు ఈ గ్రామంలో లెక్కకు మించి ఉన్నాయి. సారా మహమ్మారి తమ జీవితాలను ఆగం చేసిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలకు ప్రభుత్వం ఉపాధి కల్పించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఇదో విషాదం

ఓ యువతికి సొంత మేనమామతో 2013లో వివాహం చేశారు. వారిది నిరుపేద కుటుంబం రోజు వారి కూలితో బతుకు సాగించేవాడు. యుక్త వయస్సు నుంచే మద్యానికి బానిసగా మారాడు. తక్కువ ధరకు లభించే సారా తాగేవాడు. ఆరోగ్యం చెడిపోయి గత ఏడాది మృతిచెందాడు. అతని భార్య వయస్సు 27, పాపకు 9, బాబుకు 11 సంవత్సరాలు. ప్రస్తుతం పూట గడవడం కష్టంగా మారింది. ప్రస్తుతం ఆమె వ్యవసాయ కూలి పనులు చేసుకుంటు పిల్లలకు అండగా ఉంటుంది.

సమీప ప్రాంతం నుంచి

పెద్దదేవులపల్లికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న మిర్యాలగూడ మండలంలోని కొన్ని గ్రామాల్లో గుడుంబా తయారీ సాగుతోంది. రోజుకు వందల లీటర్ల నాటు సారాను నిషేధిత మత్తు పదార్థాలతో తయారు చేస్తున్నట్లు సమాచారం. వివిధ మార్గాల ద్వారా నిత్యం సారా సరఫరా చేస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామానికి సమీపంలో ఉండడంతో నాటుసారా ఉంటుంది. ఏళ్ల తరబడి యథేచ్ఛగా సారా తయారీ, విక్రయాలు సాగిస్తున్నా అధికారం యంత్రాంగం పట్టించుకోకపోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మిర్యాలగూడ వయా ..

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిసర ప్రాంతాలైన సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలో ఐలాపురం, వాటర్‌ట్యాంక్‌తండా, మైసమ్మకుంటతండా హైవేకు అందుబాటులో ఉన్న గూడూరు తండాలతోపాటు పలు గ్రామాలు సారా తయారీకి అడ్డాగా మారాయి. మిర్యాలగూడ, తిరుమలగిరి(సాగర్), దామరచర్ల, వాడపల్లి, అడవిదేవులపల్లి నుంచి సత్రశాల మీదుగా రెంటచింతల, మాచర్ల, పల్నాడు జిల్లాకు విచ్చలవిడిగా సారా తరులుతున్నట్లు సమాచారం. హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు నల్లబెల్లం, పటికతోపాటు కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలు ఉపయోగిస్తుంటారు. దీంతోపాటు ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతాల నుంచి విప్ప పువ్వుతో ఖరీదైన సారా తయారు చేస్తూ వ్యాపారం సాగిస్తున్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో నాటు సారా యథేచ్ఛగా సాగుతున్నా సంగతి ఎక్సైజ్ అధికారులకు తెలిసినా పట్టింపులేనట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదేవిధంగా గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఉన్నాయి. చిన్న గ్రామాల్లో ఐదుకు పైబడి పెద్ద గ్రామాలలో పదికి మించి బెల్ట్ నడుస్తున్నాయని సమాచారం.



మిర్యాలగూడలోని ఎక్సైజ్ కార్యాలయం

కేసులు నమోదు చేస్తున్నాం

మిర్యాలగూడ మండల పరిధిలో సారా తయారీ, విక్రయదారులపై దాడులు చేపడుతూ ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేస్తున్నాం. మద్యం అక్రమ వ్యాపారాలు సాగించే వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో యువత వ్యసనాలకు బానిస కాకుండా ప్రభుత్వ పరంగా అవగాహన కల్పిస్తున్నాం. సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- మహేశ్వర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ, మిర్యాలగూడ.

హైదరాబాద్ నుంచి తండాలకు నల్లబెల్లం పౌడర్



చందంపేటలో సారా తయారీ కేంద్రంపై దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

దేవరకొండ డివిజన్‌లో సారా విక్రయాలు మళ్లీ కొనసాగుతున్నాయి. సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం పౌడర్ బీదర్‌తోపాటు హైదరాబాద్ నుంచి వాహనాల్లో తండాలకు తరలిస్తూ సారా తయారు చేస్తున్నారు. లీటర్ సారా రూ.వంద నుంచి రూ.150కు విక్రయిస్తున్నారు. దేవరకొండ, చందంపేట, కొండమల్లేపల్లి, డిండి, నేరేడుగొమ్ము, చింతపల్లి, పీఏపల్లి మండలాల్లోని గ్రామాల్లో సారా విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. వ్యవసాయ బావులు, రహస్య ప్రదేశాల్లో సారా బట్టీలను పెట్టి తయారు చేస్తున్నారు. దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు 2024 జనవరి నుంచి నేటి వరకు దేవరకొండ డివిజన్‌లో 615 కేసులు నమోదు చేశారు. 335 మందిని అరెస్ట్ చేశారు. 1900 లీటర్ల సారాను సీజ్ చేశారు. 9,500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. చందంపేట మండలం నుంచి కృష్ణాపరివాహక ప్రాంతం నుంచి నాటు పడవలు, పుట్టీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తయారీదారులు వినియోగదారులకు సెల్‌ఫోన్ బుకింగ్ ద్వారా సారా సరఫరా చేస్తున్నారు. ఫోన్ చేస్తే ద్విచక్ర వాహనంపై తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి.

దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం

సారా స్థావరాలపై దాడులు చేస్తున్నాం. సారా విక్రయదారులపై కేసులు నమోదు చేస్తున్నాం. సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటిక రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం. సారా తయారు చేసి పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం.

- ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	520.20
టీఎంసీలు	149.6410
ఎడమకాల్వకు నీటి విడుదల	8,108
కుడికాల్వకు	8,023
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1350 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	280 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	17,761 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.58 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46 (టీఎంసీలు)
ప్రస్తుత నీటి మట్టం	630.50 అడుగులు
టీఎంసీలు	1.46 (టీఎంసీలు)
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	144.57 క్యూసెక్కులు

మహిళా సంఘాలకు సాధికారత

● విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యత ● జతకు రూ.75 చెల్లించనున్న ప్రభుత్వం ● ప్రతి విద్యార్థికి రెండు జతల చొప్పున పంపిణీ



శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగారెడ్డి(ఫైల్)

భువనగిరి టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతను ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించింది. గ్రామీణ మహిళా సంఘాల కుట్టు పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్‌డీఏ), మునిసిపాలిటీల్లోని మహిళా సంఘాల కుట్టు పనులను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) పర్యవేక్షించనున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి జిల్లాలోని 670ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 47 వేల మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున 94వేల యూనిఫామ్ జతలను వేసవి సెలవుల అనంతరం నూతన విద్యా సంవత్సరం ప్రారంభం తొలిరోజే నూతన యూనిఫామ్‌లను అందించే లక్ష్యాన్ని విద్యాశాఖ మహిళా సంఘాలకు విధించింది. ఈ మేరు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో యూనిఫామ్ కుట్టడం, క్లస్టర్‌మాస్టర్ కట్టర్స్‌కు ఈనెల 11వ తేదీన శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన క్లస్టర్ కట్టర్స్ త్వరలో మండల స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. ఇదే తరహా శిక్షణ తరగతులు మెప్మా ఆధ్వర్యంలో కూడా నిర్వహించనున్నారు.

పాఠశాలల తొలిరోజే అందజేతకు కసరత్తు

2025-26 విద్యా సంవత్సరానికి జిల్లాలోని 670 ప్రభుత్వ పాఠశాలలోని 47 వేల మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున యూనిఫామ్స్ ఇవ్వనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యా సంవత్సరం ప్రారంభం తొలిరోజు జూన్ 12న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫామ్ జతలు అందించనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూడా సుమారు ఇంతే మొత్తంలో యూనిఫామ్‌లు అందించారు. 577 పాఠశాలలోని 36,692 మంది విద్యార్థుల 73,384 యూనిఫామ్‌లను కుట్టే పనులను డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళా సంఘాలు కుట్టనున్నాయి. అయితే డీఆర్‌డీఏ అధికారులు కుటే పనులను రామన్నపేట, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, బీబీనగర్ క్లస్టర్స్‌గా విభజించి పర్యవేక్షిస్తున్నారు. మిగతా 93పాఠశాలలోని 10,308 మంది విద్యార్థులకు చెందిన 20,616 జతలను పట్టణ మహిళా సంఘాలు కుట్టనున్నాయి.

గత బకాయిలు రూ.23.64 లక్షలు

ఒక్కో జతకు కుట్టు చార్జీగా గత ప్రభుత్వం రూ.50లు నిర్ణయించింది. కానీ మహిళా సంఘాలకు చార్జీలను పెంచాలని డిమాండ్ చేస్తూ కుట్టు పనులను బహిష్కరించేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం కుట్టు చార్జీలను రూ.75కి పెంచింది. ఈ మేరకు ప్రస్తుత విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య 47,292 ఆధారంగా మహిళా సంఘాలు 94,584 జతలను కుట్టి సకాలంలో అందజేశాయి. జతకు రూ.75 చొప్పున కుట్టు చార్జీలుగా మహిళా సంఘాలకు రూ. 73,93,200 విద్యాశాఖ చెల్లించాల్సి ఉండేది. కానీ నేటి వరకు జతకు గతంలో ఇచ్చిన రూ.50 చొప్పున రూ.70,93,800 మాత్రమే ఇచ్చారు. అదనంగా పెంచిన రూ.25గాను రూ.23,64,600 బకాయిలు మహిళా సంఘాలకు రావల్సి ఉంది.

సకాలంలో యూనిఫామ్



పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందిస్తాము. ఈ మేరకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కుట్టు పనులను మహిళా సంఘాలు ప్రారంభించాయి. విద్యార్థుల సైజుల ఆధారంగా వారికి యూనిఫామ్ అందిస్తాం.

పి. లింగారెడ్డి, సమన్వయకర్త, జిల్లా విద్యాశాఖ.

యూనిఫామ్‌లో స్వల్ప మార్పులు



యూనిఫామ్ రంగు గత సంవత్సరం మాదిరిగానే ఉన్నది. కానీ కుట్టు పనులలో స్వల్ప మార్పులు చేశారు. బాలుర షర్ట్ బుజాలపై ఇరువైపులా ఉండే పట్టీలు, షర్ట్ జేబులపై ఉండే కప్స్ అదే మాదిరిగా బాలికల యూనిఫామ్‌లో ఉండే పట్టీలు, కప్పులను తొలగించారు. పని ఒత్తిడి కారణంగా మహిళా సంఘాలు చేసిన విజ్ఞప్తి మేరకు విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది.



నీటి విడుదల నిలిచిన మూసీ కుడి ప్రధాన కాల్వ

మూసీ మూడో విడత నీటి విడుదల నిలిపివేత

కేతేపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మూసీ ఆయకట్టుకు మూడో విడత సాగు నీటి విడుదలను అధికారులు శుక్రవారం నిలిపివేశారు. మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల ఆయకట్టులో యాసంగి పంటల సాగుకు వంద రోజుల పాటు సాగునీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. దీంతో అధికారులు గత నెల 21వ తేదీన ఆయకట్టుకు మూడో విడత సాగునీటిని నీటిని విడుదల చేశారు. మూడో విడత నీటి విడుదల నిర్ణీత 15 రోజుల గడువుకు మించి నీటిని విడుదల చేసిన అధికారులు శుక్రవారం నీటి విడుదలను నిలిపివేశారు. మూడో విడత నీటి విడుదల ప్రాజెక్టు నీటిమట్టం 636.40అడుగులు ఉండగా మూడో తడి నీటి విడుదల నిలిపివేసే నాటికి ప్రాజెక్టు నీటిమట్టం దాదాపు 6 అడుగుల మేర తగ్గి 630.50అడుగులుగా ఉంది. 10 రోజుల విరామం తర్వాత చివరిదైన నాలుగో విడత సాగు నీటిని ఈ నెల 24వ తేదీ నుంచి పంటకాలం ముగిసే వరకు నీటిని విడుదల చేయనున్నారు.

అక్షరాలు చెరిగిపోతున్నాయ్

● గతంలో పెద్ద పేపర్‌లో బిల్లులు ● ప్రస్తుతం రోల్స్ పేపర్‌లతో బిల్లులు





గతంలో ఇచ్చిన పెద్ద పేపరులో ఇచ్చిన ఇంటి బిల్లు, ప్రస్తుతం చిన్న సైజులో పేపర్‌లో ఇస్తున్న బిల్లు

సూర్యాపేటటౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో ఇంటి బిల్లులకు, నల్లా బిల్లులకు అధికారులు ఇచ్చే బిల్లు పేపర్‌లతో గృహ యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. రోల్స్ పేపర్‌తో కూడిన బిల్లులు ఇస్తుండడంతో ఆ పేపర్‌లోని అక్షరాలు రెండు మూడు రోజుల్లో చెరిగిపోతున్నాయి. సంవత్సరం మొత్తం ఎలా కాపాడుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో మాదిరిగా పేపర్ ఇవ్వకుండా కొత్త పద్ధతి సరికాదని పేర్కొంటున్నారు. గత సంవత్సరం వరకు మునిసిపాలిటీలో నల్లబిల్లులు, ఇంటి పన్నుకు సంబంధించిన బిల్లులను అధికారులు సుమారుగా ఎఫోర్ సైజు పేపర్‌తో కూడిన బిల్లులు ఇచ్చారు. ప్రస్తుతం రోల్స్ పేపర్‌ను వినియోగిస్తూ బిల్లులు అందిస్తున్నారు. అందులో అక్షరాలు సైతం పలుచగా ఉంటున్నాయి. ఈ విషయమై మునిసిపల్ సిబ్బందిని గృహ యజమానులు అడిగితే మొబైల్ ఫోన్‌లో లింకు వస్తుందని లింకు ఓపెన్ చేసుకొని చూసుకోవాలని చెబుతున్నారు. అయితే అందరికీ స్మార్ట్‌ఫోన్ ఉండదని వారి పరిస్థితి ఎలా అని ప్రశ్నిస్తున్నారు. రోల్ పేపర్ బిల్లు సంవత్సరం పాటు ఎలా ఉంటుందని పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన బొల్లు భాస్కర్‌రావు ప్రశ్నించారు. అధికారులు పదేపదే వచ్చి బిల్లు అడిగితే ఏం చూపాలో తెలియడం లేదన్నారు.

మంచి పేపర్ వాడుతున్నాం



బిల్లులకు సంబంధిచిన రశీదు రోల్‌పేపర్ క్వాలిటీగా వాడుతున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఈరోల్ పేపర్ విధానం కొనసాగుతోంది. రోల్ పేపర్ పై ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.


● శ్రీనివాస్ సూర్యాపేట మునిసిపల్ కమిషనర్

ఎల్‌ఆర్‌ఎస్ వినియోగించుకుందాం

● 25 శాతం ఫీజు రాయితీ ప్రకటించిన ప్రభుత్వం ● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 50వేలు దాటిని దరఖాస్తులు

అనధికార లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం ప్రత్యేక మాడ్యూల్‌ని సిద్ధం చేసింది. కటాఫ్ తేదీ(26.8.2020) నాటికి వచ్చిన దరఖాస్తులకు మోక్షం కలిగించేందుకు విధివిధానాలను సమూలంగా మార్చింది. ప్లాట్ల క్రమబద్ధీకరణకు 2020లో నాటి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. నాటి నుంచి నేటి వరకూ స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారులు ససేమిరా అంటున్నారు. అయితే ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులో వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) విధానాన్ని అమలు చేయడంతో పాటు 25శాతం రాయితీ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

● ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్




మిర్యాలగూడలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు స్వీకరిస్తున్న మునిసిపల్ అధికారులు

ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీల్లో 1,93,213 దరఖాస్తులొచ్చాయి. అందులో నల్లగొండ జిల్లాలోని 8 మునిసిపాలిటీలల్లో 72,642 దరఖాస్తులు, యాదాద్రి జిల్లాలోని 6 పురపాలికల్లో 55,362 దరకాస్తులు, సూర్యాపేట జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల్లో 65,209 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లా మొత్తంలో పరిష్కరించిన దరఖాస్తులు 50వేలు దాటకపోవడంతో అధికారయంత్రాంగం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీపై ప్రచారం విస్తృతం చేస్తోంది.

మిర్యాలగూడ పట్టణ పరిధిలో ఇలా..

భూములు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు 14,320 దరఖాస్తులు రాగా అందులో 252 దరఖాస్తులు పరిష్కరించారు. క్రమబద్ధీకరణ కోసం వచ్చిన మరో 576 దరఖాస్తులను పరిశీలించగా అందులో సరైన పత్రాలు లేనట్లుగా గుర్తించారు. 33 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా, 4,112 దరఖాస్తులు నిషేధిత స్థలాల్లో ఉన్నట్లు నిర్ధారించారు. మునిసిపాలిటీ పరిధిలో 8143 దరఖాస్తులు స్పష్టంగా అంటే.. ఓటీఎస్ విధానం ద్వారా నేరుగా క్రమబద్ధీకరించేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఆయా దరఖాస్తుదారులు ఈ నెల 31 లోగా రెగ్యులైజేషన్ చేసుకుని 25శాతం ఫీజు రాయితీ పొందాలని అధికారులు కోరుతున్నారు.


సద్వినియోగం చేసుకోవాలి



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఫీజు రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. యజమానులు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఇదో చక్కటి అవకాశం. దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, నీటి పారుదల శాఖల సహకారం తీసుకుంటున్నాం. దరఖాస్తుదారులకు ఎటువంటి అపోహలకు గురికావద్దు. ప్లాటును క్రమబద్ధీకరించే ముందు కొంత స్థల, దస్తావేజు పరిశీలన తదితర ప్రాసెస్ పూర్తయిన అనంతరమే ఫీజు చెల్లింపు ఉంటుంది.

-ఎండీ. యూసుఫ్ (మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ)

సులభతరంగా క్రమబద్ధీకరణ



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. ప్లాటు రిజిస్ట్రేషన్‌తో పాటే ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రాపర్టీ వివరాలు ఎంటర్ చేయగానే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఆటో క్యాలికులేషన్‌తో జనరేట్ అవుతుంది. రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్లో ఎల్‌ఆర్‌ఎస్-2020 సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిచారు. మ్యుటేషన్ మాదిరిగానే వెనువెంటనే రెగ్యులరైజేషన్ ప్రక్రియ ముగుస్తుంది.

- బలరాం యాదవ్ బుర్రవేణి, సబ్‌రిజిస్ట్రార్, మిర్యాలగూడ

హెచ్‌ఎండీఏ పరిధిలో 14 గ్రామాలు

మర్రిగూడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండలంలో 14 రెవెన్యూ గ్రామాలను హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలోకి విస్తరిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వం రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేయనుంది. అందులో భాగంగా రీజనల్ రింగ్ రోడ్డులో ఆయా గ్రామాలు ఉన్నట్లు తెలుస్తుంది. విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం మండలంలోని మేటిచందాపురం, కొట్టాల, దామెరభీమనపల్లి, బట్లపల్లి, ఇందుర్తి, ఖుదాభక్షపల్లి, కొండూరు, లెంకలపల్లి, మర్రిగూడ, సరంపేట, తమ్మడపల్లి, వట్టిపల్లి, లెంకపల్లి, యరగండ్లపల్లి, తిరుగండ్లపల్లి గ్రామాలు ఉన్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలో ఈ గ్రామాలు విస్తరించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు అందలేదని మండల అధికారులు వెల్లడిస్తున్నారు.

ఎమ్మెల్సీ సత్యంను కలిసిన సీపీఐ నాయకులు



ఎమ్మెల్సీ సత్యానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీఐ మండల నాయకులు

మర్రిగూడ, మునుగోడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఎన్నికైన సత్యంను సీపీఐ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మర్రిగూడ మండల ప్రధాన కార్యదర్శి ఆకుల రఘుమయ్య మాట్లాడుతూ సీపీఐ నుంచి ఎమ్మెల్సీగా నెల్లికంటి సత్యానికి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కలిసిన వారిలో ఈదుల భిక్షంరెడ్డి, బుర్ర శేఖర్, జక్కల అంజయ్య, సురేష్, మహేందర్ పలువురు ఉన్నారు.

● మునుగోడు మండలానికి చెందిన సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావటంపై సీపీఐ నేతలతో పాటు పలువురు వేర్వేరుగా హర్షం ప్రకటించారు. సీపీఐలో వివిధ పదవులు చేపట్టి ప్రజానేతగా ఎదిగారని అన్నారు. ఆయన్ను కలిసిన వారిలో ఆ పార్టీ నాయకులు గురిజ రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, సురిగి చలపతి, బొల్గూరి నర్సింహ, చాపల శ్రీను, లింగయ్య, కైలాసం, బొమ్మరబోయిన లాలు, దుబ్బ వెంకన్న, బండమీది యాదయ్య, ఎండీ. జానీమియా, పాండరీ, లింగస్వామి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



వల్లాల గ్రామంలో పార్టీలో చేరిన వారితో బీఆర్‌ఎస్ నాయకులు

శాలిగౌరారం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం వల్లాల గ్రామ పంచాయతీ పరిధిలోని జోలంవారిగూడెం చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కట్టా వెంకట్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తునందున నచ్చక బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో జోలం నరేందర్, జంగిలి సైదులు, రెడ్డిబోయిన విజేందర్, జోలం నరేష్, జంగిలి నవీన్, మట్టిపల్లి లింగస్వామి, జోలం రామలింగం ఉన్నారు. కార్యక్రమంలో వల్లాల గ్రామ శాఖ అధ్యక్షుడు గుండ్లపెల్లి రవీందర్, జిల్లా నాయకులు భూపతి ఉపేందర్ గౌడ్, రాగి దావీద్, జోలం గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమాతో జీవితానికి ధీమా

కేతేపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బీమాతో జీవితానికి ధీమా లభిస్తుందని బీమారం పోస్ట్ మాస్టర్ సయ్యద్ మునీర్ అన్నారు. భీమారం గ్రామానికి చెందిన కంచర్ల నాగరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందిన అనంతరం కోలుకున్నాడు. నాగరాజు ఏడాదికి రూ.500 ప్రీమియం చొప్పున ప్రమాద బీమా చేశాడు. తన రోడ్డు ప్రమాద సంఘటనలో చికిత్స పొందేందుకు చేసిన ఖర్చు రూ.91,523కు బీమా కంపెనీకి దరఖాస్తు చేశాడు. ఈ మేరకు 15 రోజుల్లోనే బాధితుడు నాగరాజుకు బీమా కంపెనీ రూ.91,523 ప్రమాద బీమాను మంజూరు చేసింది. శుక్రవారం పోస్టాఫీసు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితుడికి మంజూరైన రూ.91523 చెక్కును పోస్టుమాస్టర్ మునీర్ అందజేశారు.

నిఘా నామమాత్రమే..

(5వ పేజీ తరువాయి)

● నల్లగొండ లైన్‌వాడలో గల యూపీహెచ్‌సీలో మూడు సీసీ కెమెరాలుండగా, మెడికల్ ఆఫీసర్ గదిలో ఉన్న సీసీ కెమెరా పనిచేయడం లేదు. ఎంట్రన్స్‌లో, ల్యాబ్ వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలు పనిచేస్తున్నాయి. మెడికల్ ఆఫీసర్ గదిలోని కెమెరాని 20 రోజుల క్రితం టెక్నీషియన్లు మరమ్మతుల నిమిత్తం తీసుకెళ్లారని వైద్యాధికారి ఎక్తాయాద్ తెలిపారు.



చిట్యాల: వెలిమినేడు పీహెచ్‌సీలో వైద్యాధికారి గదిలో ఉన్న సీసీ కెమెరా

● శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీసీకెమెరాలు నామమాత్రంగా మారాయి. వాటిని పనిచేయకుండా విద్యుత్ సరఫరా ఆపేశారు. సీసీ కెమెరాల మానిటరింగ్ నల్లగొండలోని డీఎంహెచ్‌వో కార్యాలయానికి అనుసంధానం చేశారు. సీసీ కెమెరాలు పనిచేయడానికి అవసరమైన విద్యుత్ సరఫరా సిస్టమ్‌ని డాక్టర్ గదిలో ఏర్పాటు చేయగా, ఆంధ్రజ్యోతి సందర్శించిన సమయంలో కరెంట్ సరఫరా తొలగించిన విషయం వెల్లడయింది.

● మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో వాటిని అటకపైన పడేశారు. మరమ్మతులు సైతం చేసే పరిస్థితి లేకపోవడంతో వాటిని పట్టించుకోవడం లేదని సిబ్బంది పేర్కొన్నారు.

● మునుగోడు పీహెచ్‌సీలో మూడు సీసీకెమెరాలున్నప్పటికీ అవి సక్రమంగా పనిచేయడం లేదు. కేంద్రం వద్ద డిస్‌ప్లే లేకపోవడంతో పనిచేస్తుందో లేదో తెలియడం లేదని అధికారులు పేర్కొన్నారు. అయితే డాక్టర్లు, సిబ్బంది లేని సమయంలో విద్యుత్ కనెక్షన్ తొలగిస్తుంటారని, దీంతో అవి ఉన్నా ఉపయోగం లేని పరిస్థితి నెలకొందని రోగులు పేర్కొంటున్నారు.

● చిట్యాల మండలం వెలిమినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 3 సీసీ కెమెరాలు ఉండగా మూడుకు మూడు పనిచేస్తున్నాయి. మొదటి కెమెరా వైద్యాధికారి గదిలో ఉండగా 2వది రెండవది ఫార్మసీలో, మూడవది ల్యాబ్‌లో ఉన్నాయి. ఒకటో కెమెరా ఆసుపత్రికి వచ్చే రోగులను వైద్యాధికారి పరీక్షించడాన్ని చూపిస్తుండగా రెండో కెమెరా ఫార్మసీలో మందుల నిల్వ, రోగులకు ఇచ్చే మందులను చూపగా మూడోది రోగులకు సంబంధించిన రక్త, మూత్ర, తెమడతో పాటు పలు పరీక్షలను నిర్వహించడాన్ని చూపిస్తాయి. పిహెచ్‌సిలో ఉన్న కెమెరాలు స్థానికంగా వీక్షించి పర్యవేక్షించేందుకు వీలులేకుండా నేరుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికార్యాలయంలో పర్యవేక్షించేందుకు అక్కడికే అనుసంధానం చేయబడిందని వైద్యాధికారి నర్సింహ తెలిపారు.

● కట్టంగూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మూడు సీసీకెమెరాలు దాదాపు ఏడాది కాలంగా పనిచేయడం లేదు. నెట్ సదుపాయం లేకపోవడం వల్లనే కెమెరాలు నిరుపయోగంగా మారాయని తెలిపారు. కాంట్రాక్ట్ ఏజన్సీ హైద్రాబాద్‌కు చెందినవారు కావడంతో వాళ్లే వచ్చి చేస్తే తప్ప కెమెరాలను పట్టించుకునే పరిస్థితి లేకుండాపోయిందని తెలిపారు.



శాలిగౌరారం: పీహెచ్‌సీలో సీసీ కెమెరాలకు విద్యుత్ సరఫరా చేసే పరికరాలు

అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం

నాంపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామానికి చెందిన దుబ్బ నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి నర్సమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పెద్ద మల్లయ్య, పుల్లయ్య, ఈదయ్య ఉన్నారు.

అధ్వానంగా రహదారులు



కట్టంగూరు నుంచి పరడకు వెళ్లే ధ్వంసమైన రోడ్డు

- గుంతలమయంగా రోడ్లు
- కొత్త రోడ్లు రావు ఉన్నవాటికి మరమ్మతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- ఇదీ నకిరేకల్ నియోజకవర్గంలోని రహదారుల దుస్థితి.

నకిరేకల్ నియోజవకవర్గంలోని పలు గ్రామాలను అనుసంధానం చేసే రోడ్డు అధ్వానంగా మారాయి. సుమారు 10 సంవత్సరాలుగా రహదారులు అస్తవ్యస్తంగా మారినా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రభుత్వాలు మారుతున్నా, రోడ్లకు మాత్ర మోక్షం లభించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఈ రోడ్డు మార్గం ద్వారానే వస్తున్నారు పోతున్నారే తప్ప ఏమాత్రం పట్టనట్లుగా వ్యవరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలోని రహదారులకు మరమ్మతులు చేయించడంతో పాటు కొత్త రోడ్లు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,చిట్యాలరూరల్, కట్టంగూరు, కేతేపల్లి, నార్కట్‌పల్లి)

చిట్యాల మండలంలో గుండ్రాంపల్లి నుంచి సుంకెనపల్లికి, రామన్నపేట మండలం వెల్లంకికి, చిన్నకాపర్తి నుంచి పిట్టంపల్లికి, పేరేపల్లి నుంచి ఏపూర్, వెలిమినేడు నుంచి పిట్టంపల్లికి వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలమయంగా మారాయి. రోడ్డు కోతలకు గురై మట్టి తేలి అధ్వానంగా మారాయి. ఈ రహదారులే కాకుండా పలుగ్రామాలకు వెళ్లే రోడ్లుగుంతలు ఏర్పడి అధ్వానంగా ఉన్నాయి. గుంతలు పడిన రోడ్లు, కోతలకు గురైన రహదారుల స్థానాల్లో కొత్తరోడ్డు వేసి తమ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

● కట్టంగూరు నుంచి కురమర్తి వెళ్లే రహదారిపై అడగడుగునా గుంతలు ఉండటంతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 20 సంవత్సరాల క్రితం ప్రధాన మంత్రి సడక్ యోజన కింద రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పనులు చేపట్టకపోవడంతో ఈ రహదారి గుంతలమయంగా మారింది. అదేవిధంగా మండలంలోని పిట్టంపల్లి నుంచి నల్లగొండకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమై కంకర తేలి ఉండటంతో ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు.



నార్కట్‌పల్లి పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. అంతేకాక మండలంలోని అవురవాణి- గోపలాయపల్లి పీఆర్ మట్టి రోడ్డును బీటీగా మార్చే పనులు కూడా నిలిచాయి. అవురవాణి నుంచి వయా కొండపాకగూడెం, ఎనుగులదొరి మీదుగా గోపలాయపల్లి వరకు సుమారు 11కి.మీల నిడివి ఉన్న మట్టి(లింకు) రోడ్డును ఆయా గ్రామస్థుల డిమాండ్ మేరకు గత ప్రభుత్వం పీఎంజీఎస్‌వై కింద రూ.5.30 కోట్లను మంజూరు చేసింది. 2020లో ప్రారంభమైన ఈ బీటీ పనులు నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. సుమారు 8 కి.మీల మేర రోడ్డుపై కంకరను పోసి వదిలేశారు. కంకర తేలిన రోడ్డుపై ప్రయాణిస్తూ బాధిత గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వాహన టైర్లు కూడా దెబ్బతింటున్నాయని ఆవేదన చెందుతున్నారు.

కేతేపల్లి మండలంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. మండలంలోని ఇనుపాముల వద్ద ఎన్‌హెచ్ 65 నుంచి చెరుకుపల్లి వరకు, ఉప్పలపహాడ్ వద్ద ఎన్‌హెచ్ 65 నుంచి బీమారం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్లు, మిగిలిన గ్రామాలకు పంచాయతీరాజ్ రోడ్లు ఉన్నాయి. కొర్లపహాడ్-గుడివాడ రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే ఇప్పలగూడెం, తాళ్లకుంట, గుడివాడ గ్రామాల ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏఎమ్మార్పీ కాల్వ వెంట చెరుకుపల్లి వరకు గల రోడ్డు గుంతలతో దారుణంగా ఉంది. మండల కేంద్రం కేతేపల్లి శివారు 65వ నెంబరు జాతీయ రహదారి నుంచి కాసనగోడు



వరకు గల 12కి.మీ. రోడ్డు మరమ్మతులు లేక గుంతలమయంగా మారింది. దీంతో రోడ్డు గుండా ప్రయాణించే కొత్తపేట, గుడివాడ, బొప్పారం, కాసనగోడు గ్రామాల ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. అలాగే తుంగతుర్తి నుంచి భీమారం రోడ్డు పరిస్థితి అలానే మారింది. మండలంలోని భీమారం నుంచి వేములపల్లి మండలంలోని పాములపహాడ్ వరకు, బండపాలెం నుంచి కొత్తవారిగూడెం రోడ్డు, నకిరేకల్-మూసీ రోడ్డు నుంచి మండలంలోని బొప్పారం వరకు రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది.

రోడ్ల పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి

మండలంలోని వివిధ గ్రామాలకు మంజూరైన రోడ్ల మరమ్మతు పనులు కొద్ది రోజుల్లో ప్రారంభమవుతాయి. కాసనగోడు రోడ్డు పనుల కాంట్రాక్టర్ జంగిల్ కటింగ్ పనులు చేపట్టారు. మిగిలిన పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

సంపత్‌కుమార్, పీఆర్ ఏఈ

ఆనందోత్సాహాలతో హోలీ సంబరాలు



నకిరేకల్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

- ఆనందోత్సాహాలతో హోలీ సంబరాలు
- వేడుకల్లో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు
- రంగుల్లో మునిగి తేలిన యువత

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): హోలీ సందర్భంగా శుక్రవారం జిల్లా ప్రజలు సంబురాలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. చిన్నా పెద్దా, కుల, మత, వర్ణ భేదాలు లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. పిల్లలు, యువకులు ఉదయం 8 గంటలకే రోడ్ల మీదకు వచ్చి తీరుతీరు రంగులను బాటసారులు, పాదచారులపై చల్లారు. అన్ని వర్గాల ప్రజలు తమ పరిధిలో హోలీ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మహిళలు, యువతులు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి చుట్టు కాముడు వేశారు. యువకులు ద్విచక్ర వాహనాలు, వివిధ వాహనాల మీద తిరుగుతూ కేరింతలు కొట్టారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వార్డుల్లో వేడుకలు సంబురాలు అంబరాన్ని తాకాయి. ప్రజాప్రతినిధుల ఇళ్లు, జిల్లా ఉన్నతాధికారుల నివాసాల్లో రంగుల హోలీ జరిగింది. జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానం, మేకల అభినవ్ స్టేడియంలో వాక ర్స్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు జరిగాయి. వాకర్స్ పాటలు పాడుతూ డ్యాన్సులు చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, కలెక్టర్ ఐఏఎస్ అధికారి భవేష్‌మిశ్రా కుటుంబ సభ్యులు, ఎస్పీ బంగ్లా ల్లో ఎస్పీ శరత్‌చంద్రపవార్ రంగులను చల్లుకొని హోలీ వేడుకలను జ రిపారు. టీఎన్జీవోస్ నాయకులు, వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యా య సంఘాల నాయకులు కలెక్టర్‌ను, ఎస్పీని కలిసి రంగులను చల్లి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. దీంతో కలెక్టర్, ఎస్పీ బంగ్లాలు రంగులమయంగా మారాయి. జిల్లా ప్రజలకు కలెక్టర్, ఎస్పీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్‌ఎం సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్, అంజయ్య, నర్సింహలతో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పణికుమార్, మేకల జాన్‌రెడ్డి, శ్రీరామ్, భాస్కర్, తరాల పరమేష్, మల్లయ్య ఉపాధ్యాయులు డీఈవోను కలసి రంగులు రుద్ది హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎ మ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నివాసంలో రంగులు చల్లుకొని హోలీ వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బోనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి రంగులు చల్లి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి నివాసంలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో కార్యకర్తలు, టీఆర్‌ఎస్ నాయకులు చాడ కిషన్‌రెడ్డి నివాసానికి తరలివెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. చాడ కిషన్‌రెడ్డి బ్యాండ్‌ను మోగించి కార్యకర్తలకు మరింత ఉత్సాహాన్ని నింపారు. రంగులు చల్లుకుని ఒకరినొకరు ఆనందోత్సాహాలతో హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కట్టా శ్రీను, నారి నరసింహ, ఎం.వెంకన్న, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలోని పలు గ్రామాల్లో హోలీ పండుగ వేడుకలను ప్రజల ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. రంగులను చేబూని ఒకరికొకరు చల్లుకున్నారు. పలువురు వారి స్నేహితుల వద్దకు వెళ్లి రంగులను పూశారు. పలువురు కోడిగుడ్లను ఒకరిపై మరొకరు కొట్టుకున్నారు. గ్రామాల్లోని పలు కాలనీల్లో చిన్నారులు, యువతులు మహిళలు మేము సైతం అంటూ రంగులను రంగునీళ్లను ఒకరిపై మరొకరు చల్లుకున్నారు. చిన్నారులు మహిళలు బకెట్లలో రంగునీళ్లను కలిపి ఒకరిని ఎంచుకొని వారిపై ఆ నీటిని కుమ్మరించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. చిన్నారులు రంగునీటిని నింపిన పరికరాలతో స్నేహితులపై ఉత్సాహంతో చల్లుతూ ఆనందపడ్డారు.

● నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం క్యాంపులో ఎమ్మెల్యే వీరేశం హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యాలయం నుంచి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో అన్ని వర్గాల ప్రజలతో హోలీ సంబరాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి కక్ష సాధింపు చర్యలు చేయడం లేదని, గత బీఆర్‌ఎస్ పాలనలో ప్రభుత్వ కార్యాలయాలు ధ్వంసం చేశారన్నారు. జిల్లాలోనే నకిరేకల్, చిట్యాల మునిసిపాలిటీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని, త్వరలో అయిటిపాముల లిఫ్ట్ పంప్ హౌస్ పనులను ప్రారంభిస్తామన్నారు.



నల్లగొండ: హోలీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్లగొండలో ఎన్జీ కళాశాల వద్ద హోలీ వేడుకల్లో పాల్గొన్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



నార్కట్‌పల్లి: హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు

జిల్లాలో ఆధ్యాత్మిక సందడి

- పలుచోట్ల వైభవంగా కల్యాణోత్సవాలు

నార్కట్‌పల్లి, నల్లగొండ క్రైం, నల్లగొండ క్రైం, కనగల్, మర్రిగూడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పలు ఆలయాల బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం కల్యాణాలు, హోమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● నార్కట్‌పల్లి మండలంలోని మాండ్ర గ్రామ శివారులో అనంత స్వర్ణగిరి వద్ద ఉన్న మహాలక్ష్మి ఆలయంలో అష్టలక్ష్మీ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని భక్తి టీవీ కోటి దీపోత్సవం ప్రధాన యాజ్ఞికుడు రాజేశ్‌శర్మ ఈ యజ్ఞ క్రతువును నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారి వద్ద కుంకుమ పూజ చేశారు. ఉత్సవంలో ఆలయ చైర్మన్ దంపతులు ఉండ్ర భాగ్యమ్మాలింగారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




చిట్యాల మండలం తాళ్లవెల్లెంల గ్రామంలో శ్రీకృష్ణుడి కల్యాణోత్సవంలో మాంగళ్యధారణ చేస్తున్న మహిళలు

నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానంలో శుక్రవారం పౌర్ణమి తిథిని పురస్కరించుకుని మాస కల్యాణాన్ని నిర్వహించారు. ఉత్సవంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు, అనుదీప్‌రెడ్డి సంజన, సుధాకర్‌రెడ్డి మమత, దేవేందర్‌గౌడ్ సుజా, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణ పరిధిలోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో ఉన్న భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శుక్రవారం ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి కల్యాణ ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. 12వ బెటాలియన్ కమాండెంట్ వీరయ్య, ఆలయ కమిటీ మారం జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై పట్టువస్త్రాలను సమర్పించారు. ఉత్సవ తంతును రఘునందనాచార్యులు, ప్రధానఅర్చకులు మెదలవలస ఈశ్వర్‌శర్మ పూర్తి చేశారు. మూడు రోజుల పూజా సామగ్రిని స్వామి వారికి ఎంజీయూ స్టూడెంట్ కడెం సుమంత్ అందజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు అంజనేయరెడ్డి, నర్సింగ్ వెంకన్న, ఆర్ఐలు, ఆర్ఎ స్ఐలు, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.


● చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామశివారులో గల ఆర్గానిక్ శ్రీ కృష్ణ మందిరంలో శ్రీకృష్ణుడి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించా రు. ఆలయ ఆవరణలో సత్యనారాయణ స్వామి వ్రతం, విష్ణుసహస్రనామాల పారాయణం నిర్వహించగా భక్తులు అధిక పాల్గొన్నారు. రుక్మిణి, సత్యభామ, జాంబవతి, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్ష్మణ మె డలో వేశారు. ఎనిమిది మంది అమ్మవార్లకు ఎనిమిది మంది మహిళలు జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు పామన గుళ్ల వెంకటేశ్వర్లు, హరి, వెంకట్, రాజేంద్ర, అమర్, ప్రదీప్, సందీప్, రఘు, జలంధర్ పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి: అనంత స్వర్ణగిరి మహాలక్ష్మీ ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

● కనగల్ మండల కేంద్రంలోని వేణుగోపాల్‌స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పల్లిగుంతుల శ్రీనివాసచార్యులు, భాస్కరాచార్యులు, వెంకటాచార్యుల వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణతంతు నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్తలు అక్కినేపల్లి తిరుమళ్‌నాథ్, శ్రీనివాస్‌రావు, వేణుగోపాలరావు, శ్రీనివాస్‌చక్రవర్తి పట్టువస్త్రాలను తలంబ్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు లలితశ్రీనివాస్‌గౌడ్, సునీతాకృష్ణయ్యగౌడ్, లింగయ్యగౌడ్, పుష్పలతనరహరిగౌడ్, గోపాల్ నాయకులు నర్సింగ్‌లక్ష్మయ్యగౌడ్, మురళిగౌడ్, శ్రీహరి, వెంకన్న, నర్సింహ, శంకర్, గణేష్, శ్రవణ్, అశోక్, వెంకన్న, మధు, రామలింగయ్య పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం గ్రామంలో నీలకంఠ రామలింగేశ్వరస్వామి దేవాలయం గుట్టపై రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరుచుకోవాలని నీలకంఠ రామలింగేశ్వర దేవాలయ దేవదాయ చైర్మన్ రాపోలు యాదగిరి అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిట్యాల రంగారెడ్డి, రవీందర్‌రావు, రామదాసు శ్రీనివాస్, మేతరి యాదయ్య, మహేందర్, హనుమంత్, భాస్కర్, నర్సింహ, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఇఫ్తార్: 6.31 సహార్: 5.02 (శనివారం)
ANDHRAJYOTHY

నల్లగొండ
5
శనివారం 15 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 । కనిష్ఠం 20.0


నల్లగొండలోని చైతన్యపురి కాలనీలో హోలీ వేడుకల్లో మహిళలు

ఆనందోత్సాహాలతో.. హోలీ

- రంగులు చల్లుకుంటూ వేడుకలు జరుపుకున్న ప్రజలు
- ఉదయం నుంచి అన్ని ప్రాంతాల్లో హోలీ సందడి
- ర్యాలీలతో సందడి చేసిన యువకులు

జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ గడిపారు. ఏ పల్లె, పట్టణం వీధి చూసినా ఉదయం నుంచి సందడి కనిపించింది. ముఖ్యంగా చిన్నారులు గల్లీల్లో సందడి చేశారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు పట్టణాల్లో యువకులు ర్యాలీగా బయలుదేరి ఊరంతా సందడి చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, కలెక్టర్ ఐఏఎస్ అధికారి భవేష్‌మిశ్రా, కుటుంబ సభ్యులు, ఎస్పీ బంగ్లాలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ రంగులను చల్లుకుని హోలీ వేడుకలను జరిపారు. ఆయా పరిసరాలు రంగులతో నిండిపోయాయి. మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు, స్వామి వారి కల్యాణాలను నిర్వహించారు.

8


హోలీ వేడుకల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్ దంపతులు


ఎన్జీ కళాశాల ఆవరణలో హోలీ సంబురాల్లో స్థానికులు



పల్లెల్లో మళ్లీ చిచ్చు

పెరుగుతున్న నాటుసారా తయారీ

కేసులు నమోదు చేస్తున్నా ఆగని వైనం

నల్లగొండ జిల్లాలో నాటుసారా తయారీ మళ్లీ జడలు విప్పుతోంది. ముఖ్యంగా మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలో నాటుసారా తయారీ విపరీతంగా సాగుతోంది. ఇటీవల మద్యం ధరలు పెరగడం, తక్కువ ధరకు వస్తుండటంతో మద్యం ప్రియులు నాటుసారా వైపు మళ్లుతున్నారు. దీంతో చిన్న వయస్సులో కుటుంబ పెద్దలను కోల్పోయి ఆ కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఇంటి బాధ్యత మహిళలపై పడుతోంది. ఒక్క త్రిపురారం మండలం పెద్దదేవులపల్లిలో 100 మంది సారాతాగి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

పచ్చని సంసారంలో సారా తెచ్చిన చిచ్చు

(ఆంధ్రజ్యోతి-త్రిపురారం) పచ్చని సంసారంలో నాటుసారా చిచ్చుపెట్టింది. సారాకు బానిసైన ఓ వ్యక్తి మానలేకపోయాడు. ఆరోగ్యం క్షీణించి మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబం వీధిన పడింది. ఈ విషాదం నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామంలో జరిగింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఓ యువతి తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. తాత పెంచి పెద్దచేశాడు. 2018లో 18ఏళ్లకే వివాహం చేశారు. భర్తకు 1.5 ఎకరాల భూమి ఉండటంతో వ్యవసాయం చేస్తూనే కూలి పనులకు వెళ్లేవాడు. పెళ్లికాక ముందు నుంచే అతడికి సారా తాగే అలవాటు ఉంది. పెళ్లయిన తర్వాత అదే పరిస్థితి. చివరకు ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స అవసరాలకు 10 గుంటలు విక్రయించి రూ.10లక్షల వరకు ఖర్చుచేశారు. తర్వాత కూడా సారా మానకపోవడంతో 2024లో మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. భార్య వయస్సు 24 సంవత్సరాలు, కుమార్తె వయసు ఆరేళ్లు. ప్రస్తుతం కుటుంబం గడవడం కష్టంగా మారింది.



- వివరాలు 7వ పేజీలో

నిఘా నామమాత్రమే..

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాల్లో సేవలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నామమాత్రంగా మిగిలిపోయాయి. ఏర్పాటుచేసిన ఒకటి, రెండు నెలలు సరిగ్గానే పనిచేసినా ఆ తర్వాత నిర్వహణ వైఫల్యంతో పనిచేయడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దాదాపు 50శాతానికి పైగా పీహెచ్‌సీలతో సీసీ కెమెరాలు పనిచేయని వైనం 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో తేటతెల్లమవుతోంది.

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్- నల్లగొండ)



- పీహెచ్‌సీలలో అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు
- నెట్‌వర్క్ లేక, మరమ్మతులు చేయక పనిచేయని వైనం
- పలుచోట్ల విద్యుత్ కనెక్షన్లు తొలగించి పక్కన పడేసిన దుస్థితి


మర్రిగూడలో పనిచేయకపోవడంతో మూలనపడేసిన సిబ్బంది

ప్రధానంగా నెట్‌వర్క్ లేకపోవడం, రీచార్జి చేయకపోవడం, కెమెరాలకు విద్యుత్ కనెక్షన్లు తొలగించివేయడం వంటి కారణాలతో అవి నిరుపయోగంగా మారిపోయాయి. పలు చోట్ల కెమెరాలు ఉన్నప్పటికీ విద్యుత్ కనెక్షన్లు తొలగించివేసి వాటిని పనిచేయకుండా చేశారు. అదేవిధంగా మరమ్మతులు వస్తే ఏజెన్సీకి సమాచారమిచ్చి, ఆపై వాటిని మరమ్మతులు చేయించడంలో పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. సీసీ కెమెరాలుంటే వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాల్సి ఉండడంతో పాటు, వైద్యసేవలు, మందుల విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉంటుండడంతో కొన్నిచోట్ల వాటిని ఉద్దేశ్యపూర్వకంగా పనిచేయకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

- (మిగతా 8వ పేజీలో)

సూర్యాపేట జిల్లాలోనూ అదే పరిస్థితి..

సూర్యాపేట జిల్లాలోనూ పలు పీహెచ్‌సీలలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల నెట్‌సదుపాయం లేక, మరికొన్ని చోట్ల విద్యుత్ కనెక్షన్లు లేకుండా చేయడం ద్వారా నిఘా లేకుండా పోయింది. కెమెరాల్లేకపోవడంతో డాక్టర్లు సిబ్బంది ఇష్టానుసారంగా వారికి వీలైన సమయంలో వచ్చిపోతున్నారని, సమయపాలన కొరవడిందని పలు పీహెచ్‌సీలలో రోగులు వాపోతున్నారు. మునగాల మండల కేంద్రంలో జాతీయ రహదారి వెంట ఉన్న పీహెచ్‌సీలో రెండేళ్లుగా కెమెరాలు పనిచేయడం లేదని వైద్యాధికారి రవీందర్ తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని లింగగిరి పీహెచ్‌సీలోని సీసీకెమెరాలకు ఇంటర్‌నెట్ సదుపాయం లేదు. కాంట్రాక్ట్ ఏజెన్సీనే నెట్‌సదుపాయం కల్పించాల్సి ఉండగా, వారు పట్టించుకోవడం లేదు. తిరుమలగిరిలో మూడేళ్ల క్రితం రెండు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినా ఒక్కటి కూడా పనిచేయడం లేదు. అడిగేవారు లేకపోవడంతో అవి మూలకుపడ్డాయి. మోతే మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఉన్న సీసీకెమెరాలు పనిచేయడం లేదు. నెట్ సదుపాయం లేకపోవడంతో ఇవి పనిచేయడం లేదని చెబుతున్నారు.

వైద్యులు ఉన్న సమయంలో విద్యుత్ కనెక్షన్ ఉంచుతున్నారని, వారు లేని సమయంలో కనెక్షన్ తప్పించి పక్కనపడేస్తుండడంతో జిల్లా కేంద్రం నుంచి పర్యవేక్షణ కొరవడుతుందని దీన్ని నియంత్రించాలని స్థానికులు చెబుతున్నారు. ఆత్మకూరు ఎస్ పీహెచ్‌సీలో మూడు సీసీ కెమెరాలు నాలుగైదేళ్లుగా నెట్ సదుపాయం లేక నిరుపయోగంగా మారాయి.

ఏడాదిన్నరగా పనిచేయట్లేదు

మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోని అర్బన్ పీహెచ్‌సీలో హాల్‌లో రొటేట్ కెమెరా, డాక్టర్, ఫార్మసిస్టు గదుల్లో సీసీకెమెరాలు ఏర్పాటుచేశారు. ఏడాదిన్నరగా అవి పనిచేయడంలేదు. రూ.లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటుచేసినా నిర్వహణ లోపంతో పనిచేయకపోవడంతో తుప్పుపట్టిపోతున్నాయి. ఇక్కడ సీసీకెమెరాలు పనిచేయడం లేదనే విషయాన్ని జిల్లా వైద్యాధికారికి తెలియజేసినట్లు డాక్టర్ నిపుణ్ తెలిపారు.

సాంకేతిక కారణాలతో అక్కడక్కడ పనిచేయడం లేదు

జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం జరిగింది. వీటి ద్వారా పనితీరును నిరంతరం పర్యవేక్షణ చేస్తుంటాం. అయితే అక్కడక్కడ చిన్నచిన్న సాంకేతిక కారణాలతో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని మా దృష్టికి వచ్చింది. వీటిని సరి చేసేందుకు టెక్నీషియన్స్‌ను కూడా ఏర్పాటు చేశాం. ఎక్కడైతే పనిచేయకుండా ఉన్నాయో వాటన్నింటినీ సరిచేసి వినియోగంలోకి తీసుకొస్తాం. విధి నిర్వహణలో అలసత్వాన్ని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదు

పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో, నల్లగొండ



ప్రభుత్వ వైఫల్యాలను నిత్యం నిలదీస్తాం

జగదీష్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ నిరసన

మిర్యాలగూడ, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ది కాదని నియంతృత్వ పాలన అని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేసినందుకు నిరసనగా నిరసనగా శుక్రవారం మిర్యాలగూడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కరి గొంతు నొక్కితే పోరాటం ఆగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై సభలో, బయట నిలదీస్తూనే ఉంటామన్నారు. ప్రజలు, రైతులకు చేయని సంక్షేమ పథకాలను చేసినట్లు ప్రకటించటాన్ని ఎత్తిచూపుతూ ప్రశ్నించినందుకు ప్రభుత్వం అక్రమ చర్యలకు పాల్పడుతుందని నాయకులు ఆరోపించారు. ఈ చర్యలపై ప్రజలను సమాయత్తం చేసి ప్రజాపోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. దేవరకొండ, మునుగోడులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. నకిరేకల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేస్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మోసిన్ అలీ, చిట్టిబాబు నాయక్, యడవెల్లి శ్రీనివాసరెడ్డి, నాగార్జునాచారి, బాబయ్య, బాలాజీ నాయక్, చిర్ర మల్లయ్య, మగ్దుమ్‌పాషా, సాదినేని శ్రీనివాసరావు. షోయబ్, హతీరాం నాయక్, రాములు గౌడ్, దినేష్, వేములరాజు, రమేష్‌నాయక్, బొడ్డుపల్లి కృష్ణ, మందుల సత్యం, పగిళ్ల సతీష్, అయితగోని విజయ్‌గౌడ్, మేకల శ్రీనివాస్‌రెడ్డి, పరమేష్, రాజశేఖర్,జలెందర్, సైదులుయాదవ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ యల్లపురెడ్డి సైదిరెడ్డి, ఊట్కూరు ఏడుకొండలు, రమేష్, చెరుకు వెంకటాద్రి, బొడ్డు వెంకన్న, మేకల దేవయ్య, అంజయ్య, సుందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఎల్లమ్మకు నాగహారతి పూజలు

కనగల్, మార్చి 14:(ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారికి నిజఅభిషేకాలు, శ్రీలక్ష్మి సహస్రనామాలతో విశేష పూజలు జరిపి నాగహారతినిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.



బోర్డుపై బొమ్మలతో బోధన

తెలుగు ఉపాధ్యాయుడి వినూత్న యత్నం


బోర్డుపై బొమ్మలతో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు దామోదరచారి

నాంపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండలంముష్టిపల్లి జడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయులు దామోదరాచారి విద్యార్థులకు పాఠ్యాంశం సులభంగా అర్థమయ్యేందుకు బోర్డుపై బొమ్మలతో వినూత్నంగా బోధన చేస్తున్నాడు. బోధనలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అనేది కీలకం. ఈ క్రమంలో పుస్తకం, చాక్‌పీస్, చార్ట్స్ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. అందుకు కొంత వ్యయ ప్రయాస అవసరం. అప్పుడు మాత్రమే తరగతి గదిలో పిల్లల పాఠ్యాంశం అర్థం చేసుకుంటారు. ముఖ్యంగా మాతృభాష తెలుగు బోధించడం అంత సులభం కాదు. ఎందుకంటే పద్యాన్ని పద్యంగా గేయాన్ని గేయంగా బోధించడం అందరికీ సాధ్యం కాదు. కొందరు గేయం కళాత్మకంగా బోధించడం వారి సొంతం. ఈ నేపథ్యం ఉన్నప్పుడే చాలకాలం వారి మనస్సులో నిలిచిపోతుంది. బట్టీ పట్టాల్సిన అవసరం కూడ ఉండదు. ఇలాంటి కోవకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు తనదైన శైలిలో విద్యార్థులను ఆకట్టుకునే విధంగా ఉపాధ్యాయ బోధనలో విద్యార్థులను మరింత ఆకర్షింపజేస్తూ పాఠ్యాంశాలు బోధించడం ఈ పాఠశాల విద్యార్థులను ఎంతగానో ఆకర్షింపజేస్తుంది. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌లో భాగం గా పాఠ్యాంశంలోని బొమ్మలే కాక అనుబంధ బొమ్మలు కూడ నిమిషాల వ్యవధిలో బోర్డుపై వేస్తుండగానే తరగతి అంతా కూడా పాఠ్యాంశం వైపే మళ్లించడం తెలుగు ఉపాధ్యాయుని ప్రత్యేకత. పద్యాన్ని గేయాన్ని తనదైన శైలిలో కళాత్మకంగా బోధిస్తుండటంతో విద్యార్థులు ఆనందానికి ఇంకేం కావాలి. దీంతో సదరు ఉపాధ్యాయుని పట్ల విద్యార్థులకు కాదు తల్లిదండ్రులకు గ్రామస్తులకు బోధన పట్ల పూర్తి విశ్వాసం కలిగింది.

సాగునీటి సరఫరాకు అంతరాయం కలిగించొద్దు

చివరి భూములకు వెళ్లేలా సహకరించాలి: ఎస్ఐ


డీ-25 వద్ద తూముగేటును ఎత్తుతున్న ఏఎమ్మార్పీ సిబ్బంది

గుర్రంపోడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ నీరు చివరి భూముల వరకు వెళ్లేందుకు రైతులు సహకరించాలని ఎస్ఐ మధు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని కోయగూరవానిబాయి సమీపంలో డీ-25 వద్ద కొంతమంది రైతులు తూమును కిందికి దించి నీటి సరఫరాకు అంతరాయం కలిగించారు. సమాచారం తెలుసుకున్న ఏఎమ్మార్పీ అధికారులు శుక్రవారం ఉదయం అంతరాయం ఏర్పడిన ప్రదేశానికి వెళ్లి గేటును పైకి ఎత్తి కిందకు నీరు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఏఎమ్మార్పీ కాల్వపై అనధికారికంగా తూములు దించడం, కాల్వలకు అడ్డుకట్ట వేయడం, చేపల చెరువులోకి నీళ్లను మళ్లించడం వంటి చర్యలను మానుకోవాలని ఎస్ఐ మధు, ఏఈ శ్రీనివాసరావు సూచించారు. సాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధు హెచ్చరించారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

- ఎంపీ చామల, ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి కి తాను, ఎమ్మెల్యే మందుల సామేలు నిరంతరం కృషిచేస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మాదారం నుంచి ఇటుకులపహాడ్ వరకు, వల్లాల నుంచి జోలంవారిగూడెం వరకు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సామేలుతో కలిసి శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిన తెలంగాణ రాష్ట్రాన్ని నేడు సీఎం రేవంత్ రెడ్డి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఇటుకులపహాడ్ రోడ్డు నిర్మించాలని తాను ధర్నా చేశానని, ఇప్పటికీ తనపై ఆ కేసు ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రహదారులను మరమ్మతు చేయించకపోవడంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను, ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ ఇటుకులపహాడ్ రహదారి శిథిలావస్థకు చేరి పదేళ్లయినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నాట్లు వేసి నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. తన హయాంలో రోడ్డు మంజూరు చేసినందుకు సంతోషంగా ఉందని, 6నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకకిరణ్‌కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, అన్నెబోయిన సుధాకర్, తాళ్లూరి మురళీ, భూపతి వెంకన్న, ఇంతియాజ్ అహ్మద్, అల్లి సైదులు, నోముల జనార్ధన్, జయరాజ్ కాంచాని నాగరాజు, యల్లముల రమేష్, నాయకులు వేముల గోపీనాథ్, పంచాయతీ రాజ్ డిఈ కొండయ్య, ఏఈ భరత్‌చంద్ర, రోడ్డు కాంట్రాక్టర్ యానాల చైతన్యరెడ్డి తదితరులు ఉన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే సామేల్

వినియోగదారులు మోసపోవద్దు : సాంబశివరావు

మిర్యాలగూడటౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు మోసపోవద్దని వినియోగదారుల సంఘం డివిజన్ కార్యదర్శి చితిరాల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని సీతారాంపురంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏ వస్తువైనా కొనుగోలు చేయాల్సిందేనని, అలాంటప్పుడు నాణ్యతా ప్రమాణాలు చూసుకోవాల్సిన బాధ్యత వినియోగదారులదేనన్నారు. ప్రధానంగా ప్యాకేజీలలో ఉన్న వస్తువులు, ఆహార పదార్థాల తూకం, నాణ్యతను తూచా తప్పకుండా పరిశీలించాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండమల్లేపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో సాంకేతిక మరమ్మతులు చేస్తున్నందున శనివారం సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు మండలంతో పాటు నేరేడుగొమ్ము, అంగడిపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీలు ఎస్.సైదులు, దేవోజినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

సమస్యల ప్రాంగణం

» ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు » అధ్వానంగా మరుగుదొడ్ల నిర్వహణ » ఇదీ వీటీనగర్ బస్టాండ్ దుస్థితి


బస్టాండ్‌లో ప్రవహిస్తున్న మురుగు నీరు

చింతపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాల కూడలి ప్రముఖ విద్యా వ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతున్న చింతపల్లి మండలం గొడుకొండ్ల (వీటీనగర్) బస్టాండ్ సమస్యల ప్రాంగణంగా మారింది. దీంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే బస్టాండ్‌లో పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. రూ.20 నుంచి రూ.30 ఖర్చు పెట్టి తాగునీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉండటంతో ఇక్కడికి నిత్య వందలాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి వస్తుంటారు. దాతలు ఏర్పాటు చేసిన కుర్చీలు ప్రయాణికులకు సరిపోకపోవడం వల్ల కిందే కూర్చుంటూ ఇబ్బందులు పడుతున్నారు.

గొడుకొండ్ల గ్రామానికి చెందిన దివంగత శీలం ముత్యంరెడ్డి తన సొంత భూమి ఎకరం బస్టాండ్ ఏర్పాటుకు విరాళంగా అందజేశారు. దీంతో బస్టాండ్‌కు గొడుకొండ్ల అనే నామకరణం పెట్టకుండా వదిలేశారు. దాతల సహకారంతో అరకొర వసతులతో ప్రయాణ ప్రాంగణం దర్శనమిస్తోంది. కంట్రోలర్ ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు పని చేస్తుండటం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలు సాయంత్రం 5, 6 గంటలకు బస్టాండ్‌కు చేరుకుంటున్నారు. బస్సుల రాకపోకల గురించి ప్రయాణికులకు వివరించే నాథుడే కరవయ్యారని వారు వాపోతున్నారు.

సమస్యలు ఇవే

- » బస్టాండ్‌కు తాగునీటి నీరు నిత్యం రావడం లేదు.
- » రెండు, మూడు రోజులకోసారి రావడంతో ప్రయాణికులు తాగునీటిని కొనుగోలు చేసుకుంటూ దాహార్తి తీర్చుకుంటున్నారు.
- » బస్టాండ్‌కు ప్రహరీ పూర్తి స్థాయిలో లేకపోవడంతో పందులు, స్వైరవిహారం చేస్తున్నాయి.
- » మూత్రశాలలు పైపులు మరమ్మతులకు గురికావడంతో దుర్వాసన వస్తోంది.
- » బస్టాండ్‌కు బస్సులు లోనికి ప్రవేశించుటానికి (ఇన్-అవుట్) రెండు ద్వారాలు ఏర్పాటు చేయలేదు.దీంతో బస్సులు బయటకు వచ్చే వెళ్లేటప్పుడు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

దినదినాభివృద్ధి చెందుతున్న గొడుకొండ్ల (వెంకటేశ్వనగర్) ఆర్టీసీ బస్టాండ్‌లో పూర్తిసాయిలో డ్రైనేజీ ఏర్పాటు చేయలేదు. దీంతో సాగర్ - హైదరాబాద్‌కు రెండు ప్రధాన మురికి కాల్వల నిర్మాణ పనులు ఆ సంపూర్తిగా వదిలేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా కాల్వల నిర్మాణ

బస్టాండ్ ఆవరణలో దుర్వాసన

పనులు చేపట్టకపోవడంతో మురుగునీరు బస్టాండ్‌లోకి వచ్చి చేరుతుంది. దీనివల్ల దుర్వాసన వెలువడుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా అధికారులు మారుతున్న సమస్యలు మాత్రం తీరడం లేదు.

రాకపోకలకు ఇబ్బందులు



బస్టాండ్ వద్ద ఇష్టారాజ్యంగా ప్రైవేట్ వాహనాలు నిలుపుతుండటంతో బస్టాండ్ లోపలికి వచ్చే వెళ్లిపోయే బస్సులకు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇన్‌అవుట్ రెండు ముఖద్వారాలు లేకపోవడంతో బస్సులు ఒకేసారి వచ్చేటప్పుడు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- సందపట్ల లక్ష్మణ్‌సాగర్, చిరువ్యాపారి, వీటీనగర్

సమస్యల పరిష్కారానికి కృషి



బస్టాండ్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా. డ్రైనేజీ నీటిని బస్టాండ్‌లోకి రాకుండా ఎంపీడీవోకి సమాచారం ఇచ్చి సమస్య పరిష్కరిస్తా. బస్టాండ్‌లో కొత్తగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నాం. తాగునీటి సరఫరా నిత్యం అందించేందుకు చర్యలు తీసుకుంటా. చిరు వ్యాపారస్థుల కోసం కాంప్లెక్స్ ఏర్పాటు చేసేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేశా. ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తా.

- తల్లాడా రమేష్‌బాబు, డిపో మేనేజర్

జాతరలు తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీక

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


ఆమనగల్లు జాతరలో కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వేములపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, జాతరలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆనందంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఆమనగల్లు గ్రామంలో నిర్వహిస్తున్న పార్వతీ రామలింగేశ్వరస్వామి జాతర మహోత్సవంలో శుక్రవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. అనంతరం ఆయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆట ఆడుతూ భక్తులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు స్కైలాబ్‌నాయక్, చిరుమర్రి కృష్ణయ్య, ఆలయ ఛైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, నాయకులు పుట్టల కృపయ్య, పిల్లల సందీప్, ఎల్కపల్లి వెంకటేష్, వల్లంపట్ల ప్రవీణ్, పుట్టల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'జాబితాలో అక్రమంగా పేరు తొలగించారు'

త్రిపురారం, మార్చి14(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలోని తన పేరును ఎంపీడీవో కార్యాలయంలో అక్రమంగా తొలగించారని మాటూరు గ్రామానికి చెందిన మడుపు అక్కమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జాబితాలో పేరు తొలగింపుపై నెల రోజుల క్రితం ఎంపీడీవో, ఏపీవో సంప్రదించగా విచారణ చేస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభలో ఆమోదం పొంది తుది జాబితాలో వచ్చిన పేరును తొలగించారని కార్యాలయంలో కొందరు గిట్టని వాళ్లు తొలగించినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని డీఆర్‌డీవో అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. పేరు తొలగించిన వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

రంజాన్ కిట్ల పంపిణీ

మిర్యాలగూడటౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ హమీద్ మాట్లాడుతూ పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లను అందజేసేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం హర్షణీయమన్నా రు. అనంతరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

యాపిల్ సాగుపై అవగాహన పెంచుకోవాలి

● మార్కెట్ ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి


యాపిల్ సాగును పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

హాలియా, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): యాపిల్ సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని హాలియా మార్కెట్ ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం పులిమామిడి గ్రామంలో సాగు చేస్తున్న యాపిల్ సాగును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు కొత్తగా ఆలోచనలు చేయాలని, ప్రత్యామ్నాయ పంటలు, ఆదాయం చేకూర్చే పంటల సాగుపై అన్నదాతలు దృష్టి సారించాలన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటలతో శ్రమ ఎక్కువ, ఫలితం తక్కువ వస్తుండటంతో లాభాలు పొందే ఇతర పంటల వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. సాగు చేస్తున్న కాశ్మీర్ యాపిల్ బేర్ సాగును రైతులు ఆకర్షించాలని, కొత్తగా సాగు చేసే పంటలను అధికారులు, ఇతర జిల్లాలకు చెందిన రైతులతో కలిసి సాగు వివరాలు తెలుసుకోవాలన్నారు. మొదట్లో కాస్త ఇబ్బంది ఎదురైనా లాభాలు రావడంతో సంతృప్తిగా ఉంటుందన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బైకాని లక్ష్మయ్యయాదవ్, నాయకులు కోట నాగిరెడ్డి, నాగరాజు, హనుమంత్‌రెడ్డి, సైదులు తదితరులు ఉన్నారు.

ఖాన్ సేవలు మరువలేనివి

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి


ఖాన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎంఎం ఖాన్ సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన మాజీ కౌన్సిలర్, ఆవాజ్ రాష్ట్ర నాయకుడు ఎం.ఎం.ఖాన్ మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు కౌన్సిలర్‌గా అశోక్‌నగర్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం తపించేవారని అన్నారు. సీఐటీయూ నాయకుడిగా, ఆవాజ్ రాష్ట్ర కమిటీ నాయకుడిగా అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడ్డారని అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, డబ్బీకార్ మల్లేష్, సయ్యద్ హాషం, మల్లు గౌతంరెడ్డి, ఆయూబ్, గాదె పద్మ, ఖాజా హమీదుద్దీన్, నాజీమొద్దీన్, మాజీ కౌన్సిలర్ ఇలియాస్, క్రికెట్ జానీ, మక్దుం, నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రసాద్, ఉన్నం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్ అప్రజాస్వామికం

● బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్

దేవరకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అసెంబ్లీ వేదికగా మాట్లాడిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డిపై అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్ అన్నారు. దేవరకొండలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడేందుకు ప్రయత్నించిన జగదీష్‌రెడ్డిపై సస్పెండ్ చేయడం విచారకరమన్నారు. రాష్ట్రంలో రైతుబంధు, తాగు, సాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజా సమస్యలను ప్రభుత్వం అసెంబ్లీలో ప్రస్తావించడానికి ప్రయత్నించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేపై వేటు వేయడం కుట్రపూరిత చర్య అని ఆయన అన్నారు. జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటును వెంటనే ఎత్తివేయాలని రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు రాఘవచారి, చైతన్య ఉన్నారు.

ప్రేమాభిమానాలకు ప్రతీక హోలీ


మిర్యాలగూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హోలీ సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

● మిర్యాలగూడలో ఘనంగా వసంతోత్సవం

మిర్యాలగూడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రేమాభిమానాలకు ప్రతీక హోలీ పండుగ అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం ఒకరిపై నొకరు రంగులు జల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన సంఘాల నేతలతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరి జీవితాల్లో హోలీ ఆనందాలు నింపాలని అభిలాషించారు. సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌నివాసానికి వెళ్లి వివిధ ఉద్యోగ సంఘాల నేతలు ఆయన్ను రంగుల్లో ముంచెత్తారు. హోలీ సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్‌నాయక్, నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరి బాలు, ధశరథ్‌నాయక్, రవినాయక్, రవితేజనాయక్, నాగునాయక్, బాలాజీ, కృష్ణకాంత్ పాల్గొన్నారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఎన్నెస్పీ క్యాంపు అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎంఈవో బాలు, సంఘం నాయకులు సర్నాల వెంకన్న, భూక్యా లక్ష్మానాయక్, గుడిపాటి కోటయ్య, కోలారాంరెడ్డి, కృష్ణయ్య, అశోక్ కుమార్, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, నిరంజన్‌రెడ్డి, జానయ్య, రంగారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భాగ్యనగర్ కాలనీలో మహిళలు, చిన్నారులతో ఐద్వా కార్యదర్శి పాదూరి గోవర్ధన హోలీ సంబురాలు నిర్వహించారు.

● మిర్యాగూడ, దేవరకొండ డివిజన్‌లోని పలు గ్రామాల్లో హోలీ వేడుకలను ప్రజల ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. పలువురు వారి స్నేహితుల వద్దకు వెళ్లి రంగులను పూశారు. కోడిగుడ్లను ఒకరిపై మరొకరు కొట్టుకున్నారు. గ్రామాల్లోని పలు కాలనీల్లో చిన్నారులు, యువతులు మహిళలు మేము సైతం అంటూ రంగులను రంగునీళ్లను ఒకరిపై మరొకరు చల్లుకున్నారు. చిన్నారులు మహిళలు బకెట్లలో రంగునీళ్లను కలిపి ఒకరిని ఎంచుకొని వారిపై ఆ నీటిని కుమ్మరించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. చిన్నారులు రంగునీటిని నింపిన పరికరాలతో స్నేహితులపై ఉత్సాహంతో చల్లుతూ ఆనందపడ్డారు.

● దేవరకొండ పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో హోలీ వేడుకలను ఆనందోత్సవాలతో నిర్వహించారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎస్‌వీటీ, అసోసియేషన్ సభ్యులు క్రీడాకారులు, విద్యార్థులతో కలిసి రంగులు చల్లుకొని వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహులు వేరు, వేరు ప్రకటనలలో హోలీ శుభాకాంక్షలు తెలిపారు.


సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణకు రంగులు పూస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

గ్రూప్ -3లో కానిస్టేబుల్ ప్రతిభ

గుర్రంపోడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం వెలువడిన గ్రూప్-3 ఫలితాల్లో గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ప్రతిభ కనబర్చారు. కొప్పోలు గ్రామానికి చెందిన మంటిపల్లి బజార్ యాదమ్మ కుమారుడైన మంటిపల్లి శంకర్ శుక్రవారం వెలువడిన గ్రూప్-3 ఫలితా ల్లో 165వ ర్యాంకు సాధించాడు. 2020లో సి విల్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం సంస్థాన్‌నారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. పట్టుదల, ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదివి 2024లో ఎక్సైజ్ కానిస్టేబుల్, గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన గ్రూప్-2లో 674వ ర్యాంకు, ఈరోజు విడుదలైన గ్రూప్-3 ఫలితాల్లో 165 వ ర్యాంకు సాధించాడు. మంచి ర్యాంకు సా ధించడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

● కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన ఎల్లెబోయి న రవి, శోభ దంపతుల కుమార్తె ఎల్లెబోయిన రుచిత ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే 502.5 మార్కులు సాధించింది. రుచిత పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 8వ తరగతి వరకు, 9,10 తరగతులు హైదరాబాద్‌లోని తపోవన్ పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ నారాయణ ఐఏఎస్ అకాడమీలో విద్యాభ్యాసం చేసింది. 2019 నుంచి ఇంటి వద్దే ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమైంది. తాజాగా గ్రూప్-1 ఫలితాల్లో 502.5 మా ర్కులు సాధించింది. రుచితను తల్లిదండ్రులు, పట్టణవాసులు అభినందిస్తున్నారు.


తల్లిదండ్రులతో రుచిత

● పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అజ్మాపురం గ్రామానికి చెందిన గడిగ బా లకృష్ణ గ్రూప్-1 నందు 400 మార్కులు సాధించగా, గ్రూప్-2 నందు రాష్ట్రస్థాయిలో 371 మార్కులతో 442 ర్యాంకు సాధించాడు, అదే విధంగా గ్రూప్-3లో రాష్ట్ర స్థాయిలో 285 మార్కులతో 381 ర్యాంకు సా ధించాడు. సాధారణ కుటుంబానికి చెందిన గడిగ బాలయ్య, కళమ్మ కుమారుడైన బాలకృష్ణ గ్రూప్-4 పరీక్ష రాసి ప్రస్తుతం చిట్యాల మండలం తాల్లవెల్లంల నందు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో గ్రామస్థులు బాలకృష్ణను అభినందించారు.


బాలకృష్ణ

నిఘా నామమాత్రమే..

(5వ పేజీ తరువాయి)

● హాలియా పీహెచ్‌సీలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, రెండింటికీ రెండూ పనిచేయడం లేదు. సాంకేతిక సమస్యలతో కెమెరాలు పనిచేయడం లేదని, విషయం ఉన్నతాధికారులకు తెలియజేశామని వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ తెలిపారు.

● డిండి మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో అమర్చిన సీసీ కెమెరాలు గత నాలుగు నెలలుగా పనిచేయడంలేదు. ఆసుపత్రిలో డాక్టర్ గది, ఫార్మసీ, ల్యాబ్‌లలో కెమెరాలను ఏర్పాటు చేశారు. కెమెరాలు గత నాలుగు నెలలుగా నెట్ కనెక్షన్ లేక పనిచేయడంలేదు. కెమెరాలకు అమర్చిన వైరింగ్ తెగిపోవడంతో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. దీనిపై డాక్టర్ శైలిమాను వివరణ కోరగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్వయంగా ప్రైవేట్ టెక్నీషియన్‌లతో మరమ్మతులు చేయించుకోవాలని అధికారులు సూచించారని ఆమె తె లిపారు.

● వేములపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మూడు సీసీ కెమెరాలు నెలరోజులుగా పనిచేయడం లేదని, విషయాన్నీ డీఎంహెచ్‌వోకి తెలియజేశామని వైద్యాధికారి డాక్టర్ సుచరిత తెలిపారు.

● పీఏపల్లి మండలకేంద్రంలో 8 నెలల నుంచి సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. విద్యుత్ సమస్య కారణంగా వైరు కాలిపోయింది. దీంతో అప్పటి నుంచి గోడలకు కెమెరాలు ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తున్నాయి. అదే విధంగా గుడిపల్లి మండలకేంద్రంలో గత సంవత్సరం కొత్తగా ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభించారు. కాని సీసీ కెమెరాలు బిగించడం మరిచిపోయారు. సీసీ కెమెరాలు లేకుండానే వైద్యులు డ్యూటీ చేస్తున్నారు.గతంలో పాత పీహెచ్‌సీలో ఉన్న సీసీ కెమెరాలు బాగానే ఉన్న ఆ భవనంలోకి ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడంతో డాక్టర్లు, స్టాఫ్ డ్యూటీలకు డుమ్మా కొడుతున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డాక్టర్లు, ఇతర స్టాఫ్ తప్పనిసరిగా ఉండాలి. ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు షిఫ్టులు వారీగా 24 గంటలు ఉండాలి. కానీ చాలా మంది ఉదయం 11 గంటల తర్వాతనే పీహెచ్‌సీలకు వస్తున్నారని, మధ్యాహ్నం 3.30 తర్వాత వెళ్లిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

● మాడుగులపల్లి మండలంలోని పాములపహాడ్ పీహెచ్‌సీలో ఉన్న మూడు సీసీకెమెరాలు ఆరునెలలుగా పనిచేయడం లేదు. నెట్ సౌకర్యం లేనందున కెమెరాలుప నిచేయడం లేదని విషయాన్ని జిల్లా అధికారికి తెలియజేశామని వైద్యాధికారివెల్లడించారు. కెమెరాల నిఘా లేకపోవడంతో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది సమయపాలనపాటించడం లేదని రోగులు వాపోతున్నారు.


పీఏపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గోడకు పని చేయకుండా దర్శనమిస్తున్న సీసీ కెమెరా

కమనీయం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


నిడమనూరు ముప్పారంలో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నిడమనూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముప్పారం గ్రామంలో శాలివాహనుల కాలంలో నిర్మించిన ప్రాచీన మహిమాన్విత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎదుర్కోళ్లు నిర్వహించి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను తిలకించడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారిని అశ్వవాహనంపై ఊరేగించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మ న్ అంకతి సత్యం, నందికొండ మట్టారెడ్డి ప్రత్యేక పూ జలు చేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ యడవెల్లి విజయ్‌కుమార్ రెడ్డి, యోగానందం, నాయకులు గణపురం సత్యనారాయణ, మర్రి శ్రీను, తాడూరి పున్నయ్య, మే రెడ్డి చెన్న కృష్ణారెడ్డి, ఆలంపల్లి మైసయ్య, బాస్కారి నారాయణ, వెంకటరమణ, కృష్ణ, కోట్ల సైదులు, పాపయ్య, గంగాధర్, కంచి శ్రీను, ప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, యాదగిరి, స్వరాజ్యం, శ్రీను, బసప్ప పాల్గొన్నారు.

తీదేడులో సాగుతున్న బ్రహ్మోత్సవాలు

చింతపల్లి: చింతపల్లి మండలంలోని తీదేడు(వెంకటంపేట)లో రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్రతానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ధరణిపతి రమణారావు, కొరివి యాదగిరి, దాసరి శ్రీనివాస్‌యాదవ్, దాత దరూరి ఆచార్య ఆత్రేయ, ఐతమోని మల్లయ్య, సోనగంటి కృష్ణామాచారి, కొరివి రాధకృష్ణ, ముద్రు మీనారావు, పూజారి సురభి కృష్ణమూర్తిశర్మ పాల్గొన్నారు.

పార్వతీరామలింగేశ్వరస్వామి కల్యాణం

వేములపల్లి: మండలంలోని ఆమనగల్లు గ్రామంలో గల చారిత్రక దేవాలయం పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని శుక్రవారం తెల్లవారుజామున వేదపండితులు సతీష్‌శర్మ, మణిశర్మ, సూర్యనారాయణ, రవీందర్‌శర్మ బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 200 మంది దంపతులు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాలతో పాటు సమీప మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం భక్తులకు శ్రీరామ హౌస్ కీపింగ్ మెటీరియల్స్ అండ్ అనన్య ఎంటర్‌ప్రైజస్ హైదరాబాద్ సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు అశోకుమారి దంపతులు, ఈవో మృత్యుంజయశాస్త్రి, ఆలయ కమిటీ సభ్యులు పెరుమాళ్ల జోజి, వాకిట భిక్షం, లొండ కలమ్మ, ముత్యాల యుగందర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దేవరకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): దేవరకొండ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్లు దేవరకొండ సీఐ నరసింహులు తెలిపారు. గురువారం అర్ధరాత్రి దేవరకొండ బస్టాండ్‌లో 45 సంవత్సరాల వయస్సు గల మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. మృతదేహం వద్ద లభించిన ఓటర్ గుర్తింపు కార్డు మీద అమీద్‌పహాన్ పేరు (27) వెస్ట్ బెంగాల్ అని ఉందని ఆయన తెలిపారు. వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి భద్రపరిచినట్లు సీఐ తెలిపారు. వివరాల కోసం 8712670154, నంబర్‌కి సమాచారం ఇవ్వాలని కోరారు.